www.visalaandhra.com
శనివారం
23-8-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 333
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Hyderabad,Vijayawada, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam
విశాలాంధ్ర
స్థాపితం : 1952
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

రణిల్ విక్రమసింఘె అరెస్టు

కొలంబో: శ్రీలంక మాజీ అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘె అరెస్టు అయ్యారు. అధ్యక్షుడిగా ఉన్నప్పుడు తన వ్యక్తిగత విదేశీయానానికి ప్రభుత్వ నిధులు వినియోగించినట్లు ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. విక్రమసింఘె 2023 సెప్టెంబరులో లండన్ వెళ్లారు. ఈ వ్యవహారంలో శుక్రవారం ఉదయం శ్రీలంక పోలీస్ సీఐడీ ఆయనను అదుపులోకి తీసుకుంది. కొలంబో ఫోర్ట్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరుస్తామని సీఐడీ సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. 2022 జులైలో అధ్యక్షుడిగా విక్రమసింఘె ఎన్నికయ్యారు. శ్రీలంక ఆర్థికంగా దివాలా తీసే క్రమంలో ప్రజా నిరసనల నేపథ్యంలో గొటాబాయ రాజపక్సే అధ్యక్ష పగ్గాలు వీడిన సమయంలో విక్రమసింఘె అప్పటికప్పుడు పార్లమెంటరీ ఓటు ద్వారా బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే.

నాడు రాజీవ్... నేడు రాహుల్

పట్నా: ఓటర్ల జాబితాలో లోపాలను ఎత్తిచూపుతూ బీహార్‌లో 'ఓటర్ అధికార్ యాత్ర'ను లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ విజయవంతంగా సాగిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం స్థానిక జమాల్‌పూర్‌లోని మసీదుకు రాహుల్ వెళ్లారు. ఆయన తండ్రి, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ గతంలో ఇదే మసీదును సందర్శించారు. దీంతో కొందరు అప్పటి ఫొటోను, ఇప్పటి రాహుల్ ఫొటోను పోల్చుతూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు. 40 ఏళ్ల క్రితం తన తండ్రి కూర్చున్న చోటే రాహుల్

- మిగతా 2 లో

కేబుల్ వైర్లు తొలగించండి

విశాలాంధ్ర-హైదరాబాద్: జీహెచ్ఎంసీలో లైసెన్స్ తీసుకున్న కేబుళ్లు తప్ప ఏవీ ఉంచవద్దని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. రామంతాపూర్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఊరేగింపు రథానికి కేబుల్ వైరు తగిలి ఐదుగురు మృతి చెందిన సంగతి తెలిసిందే. దీంతో విద్యుత్ స్తంభాలపై కేబుల్ వైర్లను యుద్ధప్రాతిపదికన తొలగించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీనిపై భారతి ఎయిర్‌టెల్ సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ నగేశ్ భీమపాక మరోసారి విచారణ జరిపారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటంపై న్యాయమూర్తి

- మిగతా 2 లో

కేసీఆర్, హరీశ్‌రావు పిటిషన్లపై విచారణ వాయిదా

విశాలాంధ్ర - హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిటీ ఇచ్చిన నివేదికపై మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణను హైకోర్టు వాయిదా వేసింది. జస్టిస్ ఘోష్ కమిటీ నివేదికను రద్దు చేయాలని కోరుతూ కేసీఆర్, హరీశ్‌రావు హైకోర్టులో పిటిషన్‌లు దాఖలు చేయగా... వీటిపై శుక్రవారం ఉన్నత న్యాయస్థానం మరోసారి విచారణ చేపట్టింది. కమిషన్ నివేదికపై ప్రభుత్వ నిర్ణయాన్ని అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి కోర్టుకు అందించారు. అసెంబ్లీలో చర్చించిన తర్వాతే నివేదికపై ముందుకు వెళ్తామని సీజే

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఇందులో వున్న రియల్‌ఎస్టేట్ బ్యాచ్‌ని పిలుద్దామా? లేదా మనమే పంటభూముల్ని లే అవుట్లుగా మార్చేద్దామా?

సీపీఐ అగ్రనేత సురవరం కన్నుమూత

కమ్యూనిస్టు పార్టీ ప్రగాఢ సంతాపం

విశాలాంధ్ర-హైదరాబాద్: భారత కమ్యూనిస్టు పార్టీ అగ్రనాయకుడు సురవరం సుధాకర రెడ్డి(83) శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఆయనకు భార్య బీవీ విజయలక్ష్మి, కుమారులు అఖిల్, కపిల్ ఉన్నారు. మహబూబ్ నగర్ జిల్లాలోని కొల్లాపూర్ దగ్గరలోని కొండ్రావుపల్లి గ్రామంలో 1942 మార్చి 25న ఆయన జన్మించారు. తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాప రెడ్డి సుధాకర రెడ్డికి బాబాయి. కొల్లాపూర్ శాసనసభా నియోజకవగం నుంచి పోటీ చేసినా విజయం సాధించలేక పోయారు. 12వ లోక్‌సభలో, 14వ లోక్‌సభలో నల్లగొండ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించారు. లోక్‌సభ సభ్యుడిగా ఆయన అనేక కమిటీలకు సారథ్యం వహించారు. కొన్ని కమిటీలలో సభ్యుడిగా ఉన్నారు. యూపీఏ అధికారంలో ఉన్నప్పుడు 2జీ కుంభకోణాన్ని బయట పెట్టడంలో ప్రముఖ పాత్ర పోషించారు. ఎన్నికల రాజకీయాలలోకి దిగక ముందు ఆయన సీపీఐ అనుబంధ విద్యార్థి, యువజన సంఘాల్లో కీలక పాత్ర పోషించారు. యువజన సమాఖ్య ప్రచురించిన 'యువజన' పత్రికకు సంపాదకవర్గ సభ్యులుగా ఉండేవారు. 1975-76లో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు పార్టీ నిర్వహించిన కొత్త బాట వార పత్రికలో వారం వారం రాజకీయ వ్యాఖ్యానాలు రాసే వారు. విశాలాంధ్రలో ఆయన అపారమైన సంఖ్యలో వ్యాసాలు రాశారు. 1998లో మొదటిసారి లోక్‌సభకు ఎన్నికయ్యారు. అప్పుడు మానవ వనరుల అభివృద్ధి కమిటీ సభ్యుడిగా పని చేశారు. అదే సమయంలో ఆ కమిటీలో భాగమైన ఔషధ ధరల నియంత్ర కమిటీ సభ్యులుగా 1998నుంచి 1999 దాకా కొనసాగారు. ఆర్థిక శాఖ సలహా కమిటీ సభ్యులుగా ఉన్నారు. 2004లో రెండవసారి మళ్లీ లోక్‌సభ సభ్యులుగా ఎన్నికయ్యారు. 1970ల ఆరంభం నుంచి కమ్యూనిస్టు పార్టీ జాతీయ సమితి సభ్యులుగా, ఆ తరవాత కార్యవర్గ సభ్యుడిగా, కార్యదర్శి వర్గ సభ్యుడిగా, డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ఆ తరవాత ప్రధాన కార్యదర్శిగా మూడుసార్లు ఎన్నికయ్యారు. మూడవసారి ఎన్నికైన తరవాత కొద్ది నెలలు మాత్రమే ఆ బాధ్యతలు నిర్వర్తించారు. క్రమగా పార్టీ పదవుల నుంచి తప్పుకున్నారు. అయినా రాజకీయ కార్యకలాపాలకు ఎన్నడూ దూరంగా లేరు. వ్యక్తిగా ఆయన చాలా సౌమ్యుడు. వక్తగా అద్వితీయుడు. ఇతర నాయకుల ప్రసంగాలను తెలుగులోకి అనువదించడంలో దిట్ట. కర్నూలులో బీఏ ఉత్తీర్ణులయ్యాక ఉస్మానియా విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రంలో పట్టభద్రులయ్యారు. విద్యార్థి దశనుంచే ఆయన వామపక్ష రాజకీయాలలో భాగస్వామి. అఖిలభారత విద్యార్థి ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, అఖిలభారత యువజన సమాఖ్య

ఆధునీకరించిన మఖ్దూంభవన్ ప్రారంభోత్సవంలో డి.రాజాతో సురవరం

- మిగతా 2 లో

సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా కూనంనేని

- సహాయ కార్యదర్శులుగా తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, ఇ.టి.నర్సింహా
- ఏకగ్రీవంగా ఎన్నుకున్న సీపీఐ రాష్ట్ర 4వ మహాసభ
- పదిమంది కార్యదర్శివర్గం, 32 మంది కార్యవర్గం సహా 101 మందితో నూతన రాష్ట్ర సమితి

కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వర రావు నగర్ (గాజుల రామారం) : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర కార్యదర్శిగా కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు వరుసగా రెండవ సారి ఎన్నికయ్యారు. అలాగే రాష్ట్ర సహాయ కార్యదర్శులుగా తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, ఇ.టి.నర్సింహా ఎన్నికయ్యారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా 'కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వర రావు నగర్'(గాజుల రామారం)లో జరిగిన సీపీఐ రాష్ట్ర నాలుగవ మహసభ చివరి రోజు శుక్రవారం నూతన నాయకత్వాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. పది మంది కార్యదర్శివర్గ సభ్యులు, 32 మంది కార్యవర్గ సభ్యులు సహా మొత్తం 101 మందితో నూతన రాష్ట్ర సమితి ఎన్నికైంది. రాష్ట్ర కార్యదర్శిగా కూనంనేని పేరును సీపీఐ సీనియర్ నాయకులు పల్లా వెంకటరెడ్డి ప్రతిపాదించగా, కలవేన శంకర్ బలపర్చారు. ఈ ప్రతిపాదనకు రాష్ట్ర సమితి ఏకగ్రీవంగా ఆమోదం తెలియజేసింది. అలాగే రాష్ట్ర సమితికి క్యాండిడేట్ సభ్యులు, ఆహ్వానితులను, రాష్ట్ర కార్యవర్గానికి ఆహ్వానితులను కూడా ఎన్నుకున్నారు. నూతన నాయకత్వాన్ని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్ పాషా అభినందించారు. రాష్ట్రంలో సీపీఐని మరింత బలోపేతం చేస్తూ ముందుకు తీసుకెళ్లాలని వారికి దిశానిర్దేశం చేశారు.

రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు : కూనంనేని సాంబశివరావు, చాడ వెంకటరెడ్డి, పశ్య పద్మ, పల్లా వెంకటరెడ్డి, తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు, బాగం హేమంతరావు, కలవేన శంకర్, ఎం.బాలనర్సింహా, వీఎస్.బోస్, ఇ.టి.నర్సింహా

రాష్ట్ర కార్యవర్గం: కూనంనేని సాంబశివరావు, చాడ వెంకట రెడ్డి, పశ్య పద్మ, పల్లా వెంకట రెడ్డి, తక్కళ్లపల్లి శ్రీనివాస రావు, బాగం హేమంతరావు, కలవేన శంకర్, ఎం.బాలనరసింహా, వీఎస్ బోస్, ఇ.టి.నర్సింహా, బొమ్మగాని ప్రభాకర్, వీ సీతారామయ్య, పల్లా నర్సింహారెడ్డి, నెల్లికంటి సత్యం, ఎస్.కె.సాబీర్ పాషా, దండి సురేశ్, సీహెచ్.రాజారెడ్డి, ఎస్.బాల్‌రాజ్, మందా

పవన్, బి.విజయసారథి, కర్రె భిక్షపతి, పాలమాకుల జంగయ్య, ఎన్.జ్యోతి, బెజవాడ వెంకటేశ్వర్లు, ఛాయాదేవి, రామడుగు లక్ష్మణ్, కలకొండ కాంతయ్య, ఇ.ఉమా మహేశ్, పంజాల శ్రీనివాస్, ముత్యాల విశ్వనాథం, యానాల దామోదర్ రెడ్డి, షేక్ బాసుమియా

ఆహ్వానితులు: గన్నా చంద్రశేఖర్, జమ్ముల జితేందర్‌రెడ్డి, రమావత్ అంజయ్య నాయక్, కల్లూరి వెంకటేశ్వరరావు, తాండ్ర సదానందం ఎన్నికవ్వగా, రంగారెడ్డి నుంచి ఒకరిని ఎన్నుకోవాల్సి ఉంది.

నూతన రాష్ట్ర సమితి సభ్యులు

రాష్ట్ర కేంద్రం : కూనంనేని సాంబశివరావు, చాడ

- మిగతా 2 లో

లార్డ్ స్వరాజ్ పాల్ మృతి

లండన్/న్యూఢిల్లీ: ప్రముఖ ఎన్ఆర్ఐ పారిశ్రామికవేత్త లార్డ్ స్వరాజ్ పాల్ (94) కన్నుమూశారు. ఎంట్రప్రెన్యూర్‌గానే కాకుండా దాతగానూ ఆదరణ పొందిన ఆయన గురువారం సాయంత్రం లండన్‌లో తుదిశ్వాస విడిచారు. బ్రిటన్‌కు చెందిన కపారో గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ వ్యవస్థాపకుడు పాల్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. పాల్ మృతికి ప్రధాని మోదీ సంతాపం ప్రకటించారు. బ్రిటన్‌తో సన్నిహిత సంబంధాలకు

- మిగతా 2 లో

జనవరిలో 'యాదాద్రి' జాతికి అంకితం

- అత్యున్నత గ్రీన్‌పవర్ ఉత్పత్తికి తెలంగాణ కేంద్రం
- కాంగ్రెస్ అంటేనే కరెంటు: డిప్యూటీ సీఎం భట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్: రాబోయే జనవరి 15 నాటికి నాలుగువేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన యాదాద్రి పవర్ ప్లాంట్‌ను జాతికి అంకితం చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. 2022, అక్టోబరులో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ పర్యావరణ అనుమతులపై స్టే ఇవ్వగా దాదాపు రెండు సంవత్సరాల పాటు నాటి పాలకులు పవర్ ప్లాంట్ పనులను పట్టించుకున్న పాపాన పోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే 2024, ఫిబ్రవరిలో పర్యావరణ అనుమతులను తీసుకువచ్చామని వివరించారు. ఆనాటి నుంచి పవర్ ప్రాజెక్టు పనులను పర్యవేక్షణ చేస్తూ... ఇప్పటికే రెండు యూనిట్లను జాతికి అంకితం చేశామని చెప్పారు. పవర్ ప్రాజెక్టుకు బొగ్గు సరఫరా చేసేందుకు రైల్వే లైన్, కార్మికులు, అధికారులు ఉండేందుకు టౌన్‌షిప్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. పవర్ ప్లాంట్ పరిసరాల్లోని గ్రామాల్లో ప్రపంచ స్థాయి విద్య, కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా సీఎస్ఆర్ నిధుల నుంచి అందజేస్తామని డిప్యూటీ సీఎం భరోసా ఇచ్చారు. ప్రతి మండలానికి ఒక అంబులెన్స్ ను ఏర్పాటు చేస్తామని, సీసీ రోడ్లు, ఫ్లై ఓవర్లు నిర్మిస్తామని వివరించారు. కాంగ్రెస్ వస్తే కరెంటు ఉండదని కొంతమంది నాయకులు ప్రజలను భయపెట్టారని, కాంగ్రెస్ అంటేనే కరెంటు, కరెంటు అంటేనే కాంగ్రెస్ అని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో రాష్ట్రంలో నిర్మించిన హైడల్, థర్మల్,

- మిగతా 2 లో

ఉద్యమ స్ఫూర్తి నింపిన సీపీఐ మహాసభలు

727 మంది ప్రతినిధులు హాజరు

విశాలాంధ్ర- హైదరాబాద్: మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా గాజులరామారం పొట్లూరి నాగేశ్వరరావు నగర్‌లోని ఎన్.బాలమల్లేశ్ హాల్‌లో మూడు రోజులపాటు జరిగిన సీపీఐ రాష్ట్ర నాల్గవ మహాసభలు శుక్రవారం ఉద్యమ స్ఫూర్తితో ముగిశాయి. ఈ నెల 20న ప్రారంభమైన మహాసభలు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. 'ఎర్ర జెండా జిందాబాద్, ఉద్యమాలే మా ఊపిరి,

- మిగతా 2 లో

ఎర్ర జెండా పేదలకు భరోసా

సీపీఐ రాష్ట్ర మహాసభలో చాడ వెంకట రెడ్డి

కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వరరావు నగర్ (గాజుల రామారం): ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న సీపీఐ శ్రేణులు తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట రెడ్డి పిలుపునిచ్చారు. ప్రాతినిధ్యం పెంచుకోవడం ద్వారా పార్టీని మరింతగా బలోపేతం చేయాలన్నారు. ఎర్ర జెండా నీడ (నివాస స్థలం) దొరుకుతుందనే నమ్మకం నేటికీ పేదలలో ఉండటం సీపీఐకి గర్వకారణమని అన్నారు. ఈ నమ్మకాన్ని కాపాడుకునేలా భూపోరాటాల కోసం ఉద్యమ కార్యాచరణ సిద్ధం చేయాలని పార్టీ నాయకులకు చాడ వెంకటరెడ్డి సూచించారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా 'కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వర రావు నగర్' (గాజుల రామారం)లోని 'కామ్రేడ్ ఎన్.బాలమల్లేశ్' హాల్‌లో సీపీఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభల మూడవ రోజు

- మిగతా 2 లో

ప్రజా సమస్యల పరిష్కారమే సీపీఐ లక్ష్యం

- మునుగోడు ఉప ఎన్నికతో కమ్యూనిస్టుల ప్రాధాన్యత స్పష్టం: నెల్లికంటి సత్యం

కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వర రావు నగర్ (గాజుల రామారం): తెలంగాణ రాష్ట్ర రాజకీయాలను మలుపు తిప్పిన మునుగోడు ఉప ఎన్నికతో కమ్యూనిస్టుల ప్రాధాన్యత మరోసారి స్పష్టమైందని ఎమ్మెల్సీ, సీపీఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. కమ్యూనిస్టుల ప్రాబల్యం తగ్గిందన్న వారికి ఇదో చెంప పెట్టుగా వెల్లడించారు. శాసనసభ, శాసనమండలిలో సీపీఐకి ప్రాతినిధ్యంతో బడుగు, బలహీన, కార్మిక వర్గాల సమస్యల పరిష్కారానికి మరింతగా కృషి చేస్తామన్నారు. గత ఏడాది కాలంగా చట్టసభలలో పేదల సమస్యలను లేవనెత్తడంతో పాటు, బయట అనేక ప్రజా ఉద్యమాలను నిర్వహించడం ద్వారా ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్విరామంగా కృషి చేస్తోందన్నారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా 'కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వర రావు నగర్'(గాజుల రామారం)లోని 'కామ్రేడ్ ఎన్.బాలమల్లేశ్' హాల్‌లో సీపీఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రవేశపెట్టిన రాజకీయ, నిర్మాణ నివేదిక (ముసాయిదా)పై చర్చలో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సీపీఐ అనేక ప్రజా ఉద్యమాలను నిర్వహించిందని చెప్పారు. దిండి ప్రాజెక్టు పూర్తి చేసి నల్లగొండ జిల్లాకు సాగు నీరు అందించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ 25 రోజుల పాదయాత్ర ద్వారా ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తెచ్చిన విషయాన్ని నెల్లికంటి సత్యం గుర్తుచేశారు.

హమాస్ లొంగకపోతే గాజా వినాశనమే

ఇజ్రాయిల్

టెల్ అవీవ్: హమాస్ లొంగకపోతే గాజా వినాశనాన్ని ఆపలేరంటూ ఇజ్రాయిల్ రక్షణ మంత్రి కట్జ్ తేల్చిచెప్పారు. బందీలందరినీ విడుదల చేయల్సిందే అన్నారు. ఇజ్రాయిల్ షరతులతోనే యుద్ధ విరమణ జరుగుతుందని ఆయన శుక్రవారం తేల్చిచెప్పారు. 'యుద్ధం ఆగాలంటే హమాస్ లొంగిపోవాలి. ఆయుధాలు వీడాలి. ఇజ్రాయిల్ షరతులతో రాజీ పడాలి. లేదంటే గాజా వినాశనం తప్పబోదు. హమాస్ హంతకులు, రేపిస్టుల కోసం నరకద్వారాలు తెరుచుకుంటాయి' అని సామాజిక మాధ్యమంలో కట్జ్ హెచ్చరించారు. 'వాళ్లు ఒప్పుకోకపోతే గాజా మరో రఫా, బెయిల్ హనౌన్ (ఇజ్రాయిల్ దురాక్రమణతో శిథిలమైన నగరాలు) అవుతుంది' అని బెదిరించారు. గాజాలో ఉన్న బందీలందరినీ విడిపించే లక్ష్యంగా యుద్ధప్రాతిపదికన చర్చలకు ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఆదేశాల నేపథ్యంలో కట్జ్ చేసిన తాజా ప్రకటనకు ప్రాధాన్యత ఏర్పడింది. గాజాపై భీకర భూతల, వైమానిక దాడులతో 60 వేల మంది పలస్తీనియన్ల ప్రాణాలను ఇజ్రాయిల్ హరించింది.

'ఈ రెండు అంశాలు హమాస్‌ను ఓడించాయి. బేషరతుగా బందీలు విడుదలవుతారు' అంటూ నెతన్యాహు ఒక వీడియో ప్రకటన చేశారు. అయితే ఆ అంశాలు ఏమిటో వెల్లడించలేదు. తమ చర్చ తదుపరి దశ గురించీ ఎలాంటి సమావేశం ఇవ్వలేదు. హమాస్ ఇటీవల అంగీకరించిన కాల్పుల విరమణ ప్రతిపాదనపై ఇజ్రాయిల్ స్పందన కోసం మధ్యవర్తులు ఎదురుచూస్తున్నారు. మరోవైపు గాజా స్వాధీనానికి, పోరు విస్తరణకు ఇజ్రాయిల్ ప్రణాళికలు సిద్ధంచేయడంపై దేశీయంగా, అంతర్జాతీయంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుండటం తెలిసిందే.

ట్రంప్ ప్రభుత్వానికి కోర్టులో చుక్కెదురు

వాషింగ్టన్: ఫ్లోరిడాలో ఉన్న ఆ నిర్బంధ కేంద్రంలోకి కొత్తగా వలసదారులను తరలించవద్దని ఓ ఫెడరల్ కోర్టు ఆదేశించింది. ఆ కేంద్రాన్ని మూసివేయాలని స్పష్టం చేసింది. దీంతో ట్రంప్ ప్రభుత్వానికి చుక్కెదురైంది. తాజా ఆదేశాలను సవాల్ చేస్తామంటూ ఫ్లోరిడా ప్రభుత్వం పేర్కొంది. అక్రమ వలసదారులపై ట్రంప్ యంత్రాంగం ఉక్కుపాదం మోపుతోంది. ఇదే క్రమంలో ఫ్లోరిడాలోని ఎవర్‌గ్లేడ్స్‌లో నిర్బంధ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. మూడు వేల మందిని అక్కడ ఉంటేందుకు టెంట్లు, వైరు బోనులు, బెడ్లు సిద్ధం చేసింది. ఇటీవల అధ్యక్షుడు ట్రంప్ ఈ కేంద్రాన్ని సందర్శించారు. ఈ కేంద్రానికి 'ఎలిగేటర్ అల్కట్రాజ్' అని పేరు పెట్టడం గమనార్హం. అయితే అమానవీయంగా వలసదారులను బంధించేందుకు ఏర్పాటు చేసిన కేంద్రంగా పేర్కొంటూ పర్యావరణవేత్తలు, ట్రంప్ వలసవాద కార్యాచరణను వ్యతిరేకించే వారు విమర్శలు గుప్పిస్తున్నారు. పర్యావరణ వ్యవస్థకు దెబ్బ అంటూ ఆందోళన వ్యక్తంచేశారు. దీనిపై కొందరు కోర్టుకెళ్లారు. సంబంధిత పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం.. అక్కడ తాత్కాలికంగా నిర్మించిన ఫెన్సింగ్, జనరేటర్లు, చెత్త, మురుగు నిర్వహణ వ్యవస్థలను 60 రోజుల్లోగా తొలగించాలని ఆదేశించింది. కొత్తగా ఎవరినీ నిర్బంధించేందుకు వీల్లేదని స్పష్టంచేసింది.

రెండు వారాల్లో తేల్చాలి: ట్రంప్

వాషింగ్టన్: రష్యా, ఉక్రెయిన్‌లో కాల్పుల విరమణకుగాను శాంతి చర్చల కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో రెండు వారాల గడువు ఇచ్చారు. 'ఈ రెండు వారాల్లో అటో-ఇటో తేలిపోవాలి' అని అన్నారు. న్యూస్‌మ్యాక్స్ అనే వార్తాసంస్థకు ట్రంప్ ఫోన్ ద్వారా ఇంటర్వ్యూ ఇచ్చారు. అందులో ఉక్రెయిన్-రష్యా యుద్ధం గురించి మాట్లాడారు. గడువు ముగిసిన తర్వాత పరిస్థితిని బట్టి కఠిన నిర్ణయాలు తీసుకోవల్సి రావచ్చన్నారు. మరే వివరాలు వెల్లడించారు. ట్రంప్ గత శుక్రవారం రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో అలస్కాలో భేటీ అయ్యారు. శాంతి ఒప్పందం ఖరారవుతుందని అంతా భావించారు కానీ ఆ దిశగా చర్చలు ఫలించలేదు. ఇదే క్రమంలో సోమవారం శ్వేతసౌధంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సహా యూరప్ దేశాధినేలతోనూ ట్రంప్ చర్చలు జరిపారు. దీంతో జెలెన్‌స్కీ, పుతిన్ ప్రత్యక్ష భేటీపై ఆశాభావం వ్యక్తమైంది. కానీ, రష్యాకు యుద్ధ విరమణ ఆలోచనే లేదని జెలెన్‌స్కీ గురువారం ఆరోపించారు. ఆ దిశగా చర్చల అవసరాన్నే నివారించేందుకు రష్యా ప్రయత్నిస్తోందని ఆయన దుయ్యబట్టారు. తాజా పరిణామాల దృష్ట్యా శాంతి చర్చలకు ట్రంప్ రెండు వారాల సమయమివ్వడం ప్రాధాన్యత సంతరించకుంది.

ఉద్యమ స్ఫూర్తి నింపిన సీపీఐ మహాసభలు

(మొదటిపేజీ తరువాయి)

పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తాం, మార్క్సిజం, లెనినిజం వర్ధిల్లాలి' అని ప్రతినిధులు నినదిస్తూ పోరాట కార్యాచరణతో తమతమ ప్రాంతాలకు తరలివెళ్లారు. తొలి రోజు మహాసభలను జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ప్రారంభించారు. ప్రపంచవ్యాప్తంగాను... భారతదేశంలో రాజకీయ, సామాజిక పరిస్థితులు, సీపీఐ కర్తవ్యం, చేపట్టాల్సిన ప్రజా ఉద్యమాలపై రాజా ఉద్బోధించారు. ప్రతినిధుల సభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సౌహార్ద సందేశాలిచ్చారు. జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్ పాషా ... జాతీయ, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలపై ప్రసంగించారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలకు ప్రాతినిధ్యం వహిస్తూ 727 మంది ప్రతినిధులు మహాసభలకు హాజరయ్యారు. ప్రతినిధుల సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రవేశపెట్టిన వివిధ రాజకీయ, సామాజిక, ఆర్థిక అంశాలు, వివిధ వర్గాల సమస్యలపై 42 తీర్మానాలను ప్రవేశపెట్టగా మహాసభ చర్చించి ఆమోదించింది. అనంతరం రాష్ట్ర నూతన నాయకత్వాన్ని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ప్రజాసమస్యలు, కమ్యూనిస్టు సిద్ధాంతాలపై ప్రజానాట్యమండలి కళాకారులు ఆలపించిన గేయాలు సభికులను ఆకట్టుకున్నాయి. రాజకీయ, నిర్మాణ నివేదికలపై రెండు రోజుల పాటు జరిగిన చర్చలో 58 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. మహాసభలకు 619 మంది పురుషులు, మహిళలు 71 మంది ఉన్నట్లు మహాసభ అర్హత కమిటీ ప్రకటించింది. నివేదిక అర్హతకమిటీ కన్వీనర్ తెక్కెళ్లపల్లి శ్రీనివాస రావు ప్రవేశపెట్టగా, ప్రతినిధుల సభ ఆమోదించింది.

ఆడిట్ కమిషన్ నివేదిక ఆమోదం

రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో జరిగిన మూడవ మహాసభ తర్వాత 2022, అక్టోబరు ఒకటో తేదీ నుంచి 2025 మార్చి 31 వరకు జమా ఖర్చులకు సంబంధించిన వై.కృష్ణమూర్తి, వివిఎస్.మూర్తి, వై.జానకిరామ్‌లతో కూడిన ఆడిట్ కమిషన్ ఇచ్చిన నివేదికను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. సీనియర్ నాయకులు, ఆడిట్ కమిటీ సభ్యులు వై.కృష్ణమూర్తి (92)ని డి.రాజా ఘనంగా సన్మానించారు. మహాసభల ప్రాంగణంలో నవచేతన పబ్లిషింగ్ హౌస్ ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను రాజా తిలకించారు. పుస్తకాలకు సంబంధించిన వివరాలను రాజాకు సీపీఐ జాతీయ సమితి సభ్యులు కె.శ్రీనివాస రెడ్డి వివరించారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా కూనంనేని

(మొదటిపేజీ తరువాయి)

వెంకట రెడ్డి, పశ్య పద్మ, పల్లా వెంకటరెడ్డి, తక్కళ్లపల్లి శ్రీనివాస రావు, బాగం హేమంతరావు, కలవేన శంకర్, ఎం.బాలనరసింహ, ఇ.టి.నరసింహ, వీఎస్.బోస్, ఎన్.బాలమల్లేష్, వి.సృజన, ఎస్.బాల్‌రాజ్, ఎం.డి.యూసుఫ్, కలకొండ కాంతయ్య, సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ, కె.ధర్మేంద్ర, కె.మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్, వి.సీతారామయ్య, బొమ్మగాని ప్రభాకర్, బి.ఎస్.ఆర్.మోహన్‌రెడ్డి, ఎస్.మధుకర్, రమావత్ అంజయ్య నాయక్, పల్లె నర్సింహ, కె.శ్రీనివాస్ రెడ్డి, కె.ధనుంజయనాయుడు, మారపాక అనిల్‌కుమార్, **జిల్లాల నుంచి:** సుధాకర్(నిజామాబాద్), ఎల్.దశరథ్(కామారెడ్డి), టి.ఎం.ఖలీల్ (మెదక్), విజయలక్ష్మి పండిట్ (వికారాబాద్), చెన్న విశ్వనాథం (జగిత్యాల), టి.నర్సింహ(నారాయణపేట్), బి.ఆంజనేయులు(గద్వాల్), బి.బాలకిషన్ (మహబూబ్‌నగర్), తోట మల్లికార్జునరావు (ములుగు), మండ్ల ప్రభాకర్ రెడ్డి (ఆదిలాబాద్), ఐద్రి సాయికుమార్ (ఆసిఫాబాద్), మంద సదర్శన్ (సిరిసిల్లా), కె.విజయరాములు (వనపర్తి), సయ్యద్ జలాలుద్దీన్ (సంగారెడ్డి), మేకల రవి, షేక్ బాసుమియా, పంజాల రమేశ్ (వరంగల్), పంజాల శ్రీనివాస్, ఆదె స్వామి (కరీంనగర్), రాముడు లక్ష్మణ్, మేకల దాసు, రేగుంట చంద్రశేఖర్ (మంచిర్యాల), తాండ్ర సదానందం, గోశిక మోహన్ (పెద్దపల్లి), దండి సుభాష్, జమ్ముల జితేందర్ రెడ్డి, ఎర్ర బాబు, ఎస్.కె.జానిమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు (ఖమ్మం), ఎస్.కె.సాబీర్ పాషా, ముత్యాల విశ్వనాథం, కె.సారయ్య, సారెడ్డి పుల్లారెడ్డి, కల్లూరి వెంకటేశ్వరరావు, నరాటి ప్రసాద్, మున్నా లక్ష్మీకుమారి(కొత్తగూడెం), ఎస్.ఎం.డి.ఫయాజ్ (నాగర్ కర్నూల్), మందా పవన్,కె.శంకర్ (సిద్ధిపేట్), నెల్లికంటి సత్యం, పల్లా నర్సింహ రెడ్డి, ఎల్.శ్రవణ్‌కుమార్ (నల్లగొండ), గన్నా చంద్రశేఖర్,బెజవాడ వెంకటేశ్వర్లు, ఎల్లావుల రాములు (సూర్యాపేట), గోదా శ్రీరాములు, యానాల దామోదర్‌రెడ్డి, బొలగాని సత్యనారాయణ, చేదె చంద్రయ్య (యాదాద్రి భువనగిరి), పాలమాకుల జంగయ్య, పానుగంటి పర్వతాలు, కె.రామస్వామి, ఎం.డి.ఫమీదా, ఒరుగంటి యాదయ్య (రంగారెడ్డి), ఇ.ఉమా మహేశ్, జి.దామోదర్‌రెడ్డి (మేడ్చల్), కర్రె భిక్షపతి, ఆదరి శ్రీనివాస్, సిరబోయిన కరుణాకర్, మంద సదాలక్ష్మి (హన్మకొండ), కొమిని రాజ్‌కుమార్ (భూపాలపల్లి), సి.హెచ్.రాజారెడ్డి, పాతూరి సుగుణమ్మ (జనగామ), బి.విజయసారథి, బి.అజయ్ సారథి(మహబూబాబాద్), స్టాలిన్, ఛాయాదేవి (హైదరాబాద్),ఇన్సాఫ్(1), నిర్మల్ జిల్లా(1), మజ్దూర్ ఫ్రంట్(1), రంగారెడ్డి (2) సభ్యులను ఎన్నుకోవలసి ఉంది.

క్యాండిడేట్ సభ్యులు : ముదుప నళిని(మహిళా ఫ్రంట్), ఎం.నర్సింహ, బి.వెంకటేశ్(ట్రేడ్ యూనియన్), ఆత్మీరా రామ్మూర్తి(గిరిజన సంఘం), కె.భూమయ్య (ఎఐకెఎస్), కె.వి.ఎల్.(ఆయిప్సో), జోగుల మల్లయ్య (మంచిర్యాల), సిద్దినేని కరుణాకర్ (ఖమ్మం), సలిగంటి శ్రీనివాస్ (కొత్తగూడెం), బంటు వెంకటేశ్వర్లు(నల్లగొండ), ఉస్తేల నారాయణరెడ్డి(సూర్యాపేట), టి.రామకృష్ణ, బద్దుల జంగయ్య(రంగారెడ్డి)

ఆహ్వానితులు : కె.సూర్యనారాయణ (ఎఐకెఎస్), కె.శ్రీనివాస్ (ప్రజానాట్యమండలి), టి.వెంకట్రాములు (వృత్తి సంఘాలు), ఎస్.బాబు(ఆర్‌టిసి), జానకిరామ్ (బ్యాంకింగ్), వి.చెన్నకేశవరావు (సి.ఆర్.ఫౌండేషన్), ఉజ్జిని రత్నాకర్‌రావు(తెలంగాణ అమరవీరుల ట్రస్ట్), కట్టెబోయిన శ్రీనివాస్(మహబూబాబాద్), ఇప్పకాయల లింగయ్య, బొల్లం పూర్ణిమ (మంచిర్యాల), ఎం.డి.సలీమ్ , బి.జి.క్లెమెంట్ (ఖమ్మం), ఎస్.డి.సలీమ్, రావులపల్లి రవికుమార్, చంద్ర నరేంద్ర కుమార్(కొత్తగూడెం), వర్ల వెంకటయ్య, కొంకటి కేశవులుగౌడ్(నాగర్‌కర్నూల్), ఉజ్జిని యాదగిరిరావు(నల్లగొండ), ఆది సాయన్న (జనగామ), నల్లు సుధాకర్ రెడ్డి(మహబూబాబాద్), కమతం యాదగిరి, జి.చంద్రమోహన్‌గౌడ్ (హైదరాబాద్), తోట భిక్షపతి (హన్మకొండ), గౌతమ్ గోవర్ధన్ (పెద్దపల్లి), కె.ఏసురత్నం (మేడ్చల్ మల్కాజ్‌గిరి), వీరభద్రయ్య (సింగరేణి), సిద్ధిపేట (1),యాదాద్రి భువనగిరి(1), రంగారెడ్డి (1)ల నుంచి ఒక్కొక్కరిని ఎన్నుకోవలసి ఉంది.

లార్డ్ స్వరాజ్ పాల్ మృతి

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చిన మద్దతును లార్డ్ పాల్‌ను భారత్ ఎప్పటికీ మరువలేదన్నారు. ప్రజా సేవతో, దాతృత్వంతో మంది గుర్తింపు తెచ్చుకున్నారని, పారిశ్రామికవేత్తగా రాణించారని, భారత్-బ్రిటన్ బంధానికి ఎంతగానో తోడ్పడ్డారని, ఆయన చిరస్మరణీయుడని తన సంతాప సందేశంలో మోదీ పేర్కొన్నారు. స్వరాజ్ పాల్ 1931, ఫిబ్రవరి 18న జన్మించారు. పంజాబ్, జలంధర్‌లో పాఠశాల విద్యను పూర్తి చేసుకున్న ఆయన 1949లో పంజాబ్ యూనివర్సిటీ నుంచి బీఎస్సీ చేశారు. ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లారు. మాసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ) నుంచి మెకానికల్ ఇంజినీరింగ్‌లో బ్యాచిలర్స్ & మాస్టర్స్ డిగ్రీలు పొందారు. అనంతరం భారత్‌కు తిరిగి వచ్చి తమ కుటుంబ వ్యాపారం అపీజే సురేంద్ర గ్రూప్ చేపట్టారు. లుకేమియాతో బాధపడే తన కుమార్తె అంబికా చికిత్స కోసం 1966లో బ్రిటన్‌కు వెళ్లారు. నాలుగేళ్ల అంబికా మరణానంతరం అంబికా పాల్ ఫౌండేషన్ అనే చారిటబుల్ ట్రస్టును లండన్‌లో ఏర్పాటు చేసి, ప్రపంచ వ్యాప్తంగా అనేకగా పిల్లలకు విద్య, ఆరోగ్య సేవలు అందించడంలో తోడ్పడ్డారు. తన కుమార్తె జూకు వెళ్లినప్పుడు చాలా ఆనందంగా ఉండేదన్న కారణంగా అంబికా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంబికా పాల్ చిల్డ్రన్స్ జూను లండన్‌లో ఏర్పాటు చేశారు. 2015లో కుమారుడు అంగద్‌ను కోల్పోయారు. 2022లో భార్య అరుణ మరణించారు. దీంతో లార్డ్ పాల్ మరింతగా దానధర్మాలు చేశారు. తన భార్య పేరు మీద 2023 ఫిబ్రవరిలో లండన్‌లోని చారిత్రక ఇండియన్ జింఖానా క్లబ్‌లో లేడీ అరుణ స్వరాజ్ పాల్ హాల్‌ను ప్రారంభించారు. ఆ సందర్భంగా తన భార్యను స్మరించుకున్న పాల్... మా 65ఏళ్ల వివాహ జీవితంలో ఎన్నడూ గొడవ పడలేదన్నారు. కాగా, ఏటా విడుదలయ్యే 'సండే టైమ్స్ రిచ్ లిస్ట్'-2025లో 81వ స్థానంలో స్వరాజ్ పాల్ నిలిచారు. లండన్ కేంద్రంగా కపారో సంస్థ ప్రపంచ వ్యాప్తంగా 40 చోట్ల కార్యకలాపాలు సాగిస్తోంది. బ్రిటన్, ఉత్తర అమెరికా, భారత్, మధ్యాసియాలోనూ కార్యాలయాలున్నాయి. లార్డ్ పాల్ కుమారుడు ఆకాశ్ పాల్ ప్రస్తుతం కపారో ఇండియా చైర్మన్‌గా, కపారో గ్రూప్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. లార్డ్ స్వరాజ్ పాల్‌ను బ్రిటిష్ మహారాణి 1978లో నైట్‌హుడ్‌తో సత్కరించారు. లార్డ్ పాల్ ఆఫ్ మేరీలోబోన్ బిరుదును ఆయన పొందారు. బ్రిటిష్ హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యులు అయ్యారు. విదేశీ విధాన కేంద్రం సలహా మండలి సభ్యుడిగా వ్యవహరించారు. 1998 నుంచి 2010 వరకు బ్రిటిష్ బిజినెస్ ఫోరం రాయబారిగా పనిచేశారు. 2000 నుంచి 2005 వరకు ఇండో-బ్రిటిష్ రౌండ్ టేబుల్ సదస్సు సహ-చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. బ్రిటన్, అమెరికా, స్విట్జర్లాండ్, రష్యా యూనివర్సిటీల నుంచి మొత్తం 15 గౌరవ డిగ్రీలు అందుకున్నారు. భారత ప్రభుత్వం ఆయనను పద్మ భూషణ్, భారత్ గౌరవ్ అవార్డులతో సన్మానించింది. ఓ దాతగా, పారిశ్రామికవేత్తగా జీవిత సాఫల్య పురస్కారాన్ని కూడా లార్డ్ స్వరాజ్ పాల్ జీవిత అందుకున్నారు.

'యాదాద్రి' జాతికి అంకితం

(మొదటిపేజీ తరువాయి)

సోలార్, విండ్ పవర్ ప్రాజెక్టులు గొప్పగా నడుస్తున్నాయని చెప్పారు. దేశంలోనే అత్యున్నత గ్రీన్ పవర్ ఉత్పత్తికి తెలంగాణను కేంద్రంగా చేస్తామని ప్రకటించారు. రాష్ట్రంలో 29 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు, 51 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తును ఉచితంగా అందిస్తూ పేదల పక్షాన ప్రభుత్వమే విద్యుత్ సంస్థలకు రూ.17 వేల కోట్లు చెల్లిస్తుందని వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం భూ నిర్వాసితులు అందరికీ ఉద్యోగాలు ఇవ్వాలని తీసుకున్న నిర్ణయం ఫలితంగా 500 మందికి యాదాద్రి పవర్ ప్లాంట్ లో ఉద్యోగాలు ఇవ్వగలిగామని డిప్యూటీ సీఎం తెలిపారు. నిర్వాసితులకు ఉద్యోగాల కోసం ప్రస్తుత మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ గత ప్రభుత్వ హయాంలో తీవ్రంగా పోరాటం చేశారని... వారి సంకల్పం నేడు సాకారమైందన్నారు. దివంగత సీఎం రాజశేఖర్ రెడ్డి రాష్ట్రంలో లక్షలాది మంది గిరిజనులకు ఆర్.ఓ.ఎఫ్.ఆర్ పట్టాలను అందించారని తెలిపారు. ఆ పట్టాలు ఉన్న వారికి కూడా భూములు కోల్పోతే ఉద్యోగాలు ఇవ్వాలని ప్రజా ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. తెలంగాణ జెన్కోలో విధుల్లో ఉండి ప్రాణాలు కోల్పోయిన 159 మంది బాధిత కుటుంబాలకు రెండోసారి మానవీయ కోణంలో ప్రజా ప్రభుత్వం కారుణ్య నియామక ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు చెప్పారు.

మహిళా పోలీస్ సంక్షేమమే ధ్యేయం

మహిళా పోలీస్ సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని భట్టి విక్రమార్క అన్నారు. లింగ వివక్ష విధుల్లో చూపడం సరైనది కాదని, మహిళా పోలీసులతో మహిళా అనే పదాన్ని తొలగించాలన్న సిఫారసు మంచి ఆలోచన, దీనికి తాను ఏకీభవిస్తున్నానని ఆయన తెలిపారు. మహిళా పోలీస్ సిబ్బంది సమస్యలపై కమిటీ వేసి రాష్ట్ర ప్రభుత్వానికి అందిస్తే అమలుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రజల అవసరాలను తీర్చడమే తమ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ప్రజల జీవనప్రతిగతులను మార్పగలం అన్న భావనతో మానవీయ కోణంలో పరిపా లించే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, క్యాబినెట్ రాష్ట్రంలో ఉందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా... పెట్టుబడులు రావాలన్నా శాంతి భద్రతలు ముఖ్యమన్నారు. అంకిత భావంతో పనిచేసే పోలీసు సిబ్బంది ఉన్నప్పుడే అది సాకారం అవుతుంది అన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణలో తెలంగాణ నెంబర్ వన్ గా ఉందన్నారు. కార్యాలయాల భవనాలు, పోలీస్ స్టేషన్లు, సిబ్బంది క్వార్టర్స్‌కు సంబంధించి ప్రతిపాదనలు తీసుకురావాలని ఆ శాఖ ఉన్నతాధికారులకు సూచించారు. విద్యా విధానంలో కొత్త ఒరవడిని ప్రజా ప్రభుత్వం సృష్టిస్తుందని తెలిపారు. 25 ఎకరాల విస్తీర్ణంలో, 200 కోట్ల రూపాయల పెట్టుబడితో ఒక్కో స్కూల్ ను ఇంటర్నేషనల్ స్టాండర్డ్ తో నిర్మిస్తున్నామని తెలిపారు. ఒకేసారి 104 పాఠశాలలు నిర్మిస్తున్నాం అన్నారు. పోలీస్ సిబ్బంది పిల్లలు చదువుకునేందుకు ఒక యంగ్ ఇండియా ఇప్పటికే ప్రారంభించామని చెప్పారు.

ఎర్ర జెండా పేదలకు భరోసా

(మొదటిపేజీ తరువాయి)

(శుక్రవారం) సభలో చాడ వెంకట రెడ్డి మాట్లాడుతూ వందేళ్ల చరిత్ర కలిగిన సీపీఐ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిందని గుర్తుచేశారు. ఆకలి కోసం పని చేయలేదన్నారు. దేశంలోగానీ రాష్ట్రంలోగానీ పార్టీ అధికారంలోకి రాలేదని, దానికి గుర్తింపు లేదన్న విమర్శలను ఖండించారు. పోరాటాల గుర్తుగా సీపీఐ... ఎర్ర జెండా నీడ 'పేదలకు భరోసా' అని అన్నారు. 'రాష్ట్రం లో ధరణి పోయి భూభారతి వచ్చినప్పటికీ పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. ఇప్పటికీ గ్రామ స్థాయిలో భూ సమస్యలు ఉన్నాయి ని, వాటిని పరిష్కరించే దిశగా ఉద్యమాలు చేపట్టాలి' అని చాడ వెంకట రెడ్డి అన్నారు. 'కమ్యూనిస్టు పార్టీకే ఉద్యమాలే ఊపిరి, తెలంగాణలో పార్టీ విస్తరణ, బలోపేతానికి చాలా అవకాశాలు ఉన్నాయి. ఆ దిశగా పార్టీ నాయకులు, శ్రేణులు కంకణబద్దులు కావాలి' అని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యం పేరుతో నియతృత్వం, ఫాసిస్టు పాలన సాగిస్తోం దని విమర్శించారు. మతోన్మాదవాదిగా, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలను పాటించే వ్యక్తి 11 ఏళ్లుగా ఎర్రకోటపై జాతీయ జెండాను ఎగురవేయడం దురదృష్టకరమన్నారు. బీజేపీని ఎదుర్కొనేందుకు వామపక్షాల ఐక్యతే అదునుగా వెలువాలని సూచించారు. 'బీజేపీ హటావో దేశ్ కో బచావో' నినాదంతో దేశవ్యాప్తంగా ప్రచారోద్యమాన్ని సీపీఐ నిర్వహించిందని చాడ గుర్తు చేశారు.

కేసీఆర్, హరీశ్‌రావు పిటిషన్లపై విచారణ వాయిదా

(మొదటిపేజీ తరువాయి)

ధర్మాసనానికి తెలిపారు. కమిషన్ నివేదికను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడాన్ని హైకోర్టు తప్పుబట్టింది. వెంటనే తొలగించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. కౌంటర్ దాఖలుకు ప్రభుత్వం, కమిషన్ కు మూడు వారాలు, ప్రతివాదుల కౌంటర్‌పై జవాబివ్వడానికి పిటిష నర్లకు వారం గడువు ఇచ్చింది. అసెంబ్లీలో చర్చించిన తర్వాత కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలుంటాయని ఏజీ చెప్పిన నేపథ్యంలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాల్సిన అవసరం లేదని హైకోర్టు స్పష్టం చేసింది.

ఓటు నమోదుకు ఆధార్

పరిగణనలోకి తీసుకోవాలని ఈసీకి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: బీహార్‌లో ఓటు కోల్పోయిన వారు తిరిగి ఓటు నమోదు చేసుకునేందుకు ఆధార్‌ను సైతం పరిగణలోకి తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆధార్ లేదా ఇతర 11 గుర్తింపు పత్రాలను కూడా స్వీకరించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. బీహార్‌లో జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పై దాఖలైన పిటిషన్లను న్యాయమూర్తులు సూర్యకాంత్, జోయ్‌మాల్యాతో కూడిన సుప్రీం ధర్మాసనం శుక్రవారం విచారించింది. ఈ సందర్భంగా బీహార్ రాజకీయ పార్టీలపై ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఓటరు జాబితాను తొలగించిన 65 లక్షల మందికి ఎందుకు మద్దతుగా నిలబడలేదని పార్టీలను ప్రశ్నించింది. ఎస్ఐఆర్ అంశంపై రాజకీయ పార్టీలు చొరవ చూపట్లేదన్న సుప్రీంకోర్టు, పార్టీల తీరును తప్పుబట్టింది. 85 వేల కొత్త ఓట్లు నమోదైతే బూత్‌స్థాయి ఏజెంట్ల (బీఎల్ఏ)నుంచి కేవలం రెండు అభ్యంతరాలే రావడమేంటని ప్రశ్నించింది. సవరణ క్రమంలో ఓటు కోల్పోయిన వారు ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకోవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. జాబితా సవరణ ప్రక్రియ ఓటర్లకు సులభతరంగా ఉండాలని కూడా ఈసీకి సూచించింది. బూత్ లెవల్ ఏజెంట్లు సమర్పించిన అభ్యంతరాలకు బూత్ లెవల్ అధికారులు రసీదులు జారీ చేయడం లేదని కొంతమంది పిటిషనర్లు లేవనెత్తిన ఆందోళనలను పరిష్కరిస్తూ...భౌతిక ఫారమ్‌లను సమర్పించిన చోట రసీదును అంగీకరించాలని కోర్టు బీఎల్ఓలను ఆదేశించింది. విచారణ సందర్భంగా భారత ఎన్నికల కమిషన్ తరపున సీనియర్ న్యాయవాది రాకేష్ ద్వివేది వాదనలు వినిపించారు. ఆగస్టు 14న కోర్టు ఆదేశించిన విధంగా ముసాయిదా జాబితా నుండి తొలగించబడిన ఓటర్ల జాబితా, మినహాయింపులకు గల కారణాలతో సహా వెబ్‌సైట్లు, పోలింగ్ బూత్‌లలో ప్రచురించబడిందని తెలిపారు. నమ్మతి అఫిడవిట్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. జాబితాలను రాజకీయ పార్టీల బీఎల్ఏలకు పంపినట్టే చేసినట్లు ఆయన తెలిపారు. "ఇప్పటి వరకు ఏ రాజకీయ పార్టీ కూడా (తొలగింపుపై) ఒక్క అభ్యంతరం కూడా దాఖలు చేయలేదు" అని ద్వివేది స్పష్టం చేశారు. ఏ రాజకీయ పార్టీ కూడా కోర్టు ముందుకు రాలేదని ద్వివేది చెప్పినప్పుడు, సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబాల్, డాక్టర్ ఎఎం సింఘ్వీ తప్పుబట్టారు. బీహార్‌లోని ప్రధాన ప్రతిపక్ష పార్టీ ఆర్జేడీ నుండి ఎంపీ మనోజ్ ఝా తరపున తాను ప్రాతినిధ్యం వహిస్తున్నానని సిబల్ చెప్పారు.

కేబుల్ వైర్లు తొలగించండి

(మొదటిపేజీ తరువాయి)

తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రామంతాపూర్ ఘటనను ఆయన ప్రస్తావించారు. బర్త్ డే రోజే తండ్రికి కేకలోసి పెట్టిన బాలుడి ఘటనపై ఆగ్రహోద్రేకంగా మాట్లాడారు. కేక్ కట్ చేయాల్సిన 9 ఏళ్ల బాలుడు తలకొరివి పెట్టడం కలచివేసిందని జస్టిస్ నగేష్ భీమపాక అన్నారు. విద్యుత్ ప్రమా దంపై ఎవరికి వారే చేతులు దులిపేసుకుంటే ఎలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ప్రజల ప్రాణాలకు బాధ్యులెవరు? పసిప్రాయులు పోతున్నాయి. దీనికి అందరం బాధ్యులు మే. సమాజం సిగ్గుతో తలదించుకోవాలి. చలన రహిత చట్టాలతో ప్రజల ప్రాణాలు ఎలా కాపాడగలం' అని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. విద్యుత్ స్తంభాలు ఒరిగిపోతున్నాయన్న పిటిషనర్ల వాదనపై జస్టిస్ నగేశ్ భీమపాక ఆగ్రహం వ్యక్తం చేశారు. మామూళ్లతో కొందరు ఉద్యోగుల జేబులు బరువెక్కుతున్నాయన్నారు. ఒకరినొకరు నిందించుకోవద్దని, ఇలాంటివి పునరావృతం కానివ్వద్దని సూచించారు. స్తంభాలపై ఉన్న కేబుల్ నలుపు రంగులో ఉన్నందున గుర్తుపట్టలేకపోయామని పిటిషనర్ తరపు న్యాయవాది పేర్కొనగా... కరెన్సీ నోట్లపై ఉన్న గాంధీని మాత్రం బాగానే గుర్తుపడతారని న్యాయమూర్తి చురకలంటించారు.

నాడు రాజీవ్... నేడు రాహుల్

(మొదటిపేజీ తరువాయి)

గాంధీ కూర్చుని మౌలానాతో ముచ్చటించడంతో ఈ ఫొటో వైరల్ అయింది. జమాల్‌పూర్‌లోని ఖాన్గా రెహమానీ మసీదు పెద్ద మౌలానాను రాహుల్ కలిశారు. ఆయనతో పాటు ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ఉన్నారు. రాజీవ్ 1985లో సందర్శించినప్పటి నుంచి వారి కుటుంబంతో ఈ మసీదుకు అనుబంధం ఏర్పడింది. మహాత్మా గాంధీ, జవహర్ లాల్ నెహ్రూ సహా ఎందరో ప్రముఖులు ఈ మసీదును గతంలో సందర్శించారు.

సీపీఐ అగ్రనేత సురవరం కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

జాతీయ నాయకులుగా కొనసాగారు. సుధాకర రెడ్డి మంచి చదువరి. నిజానికి పుస్తకాల పురుగు. క్రియాశీల రాజకీయాల నుంచి విరమించుకున్న తరవాత ఎక్కువ సమయం పుస్తక పఠనంలోనే గడిపారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు సమితి కార్యదర్శిగా పదకొండు సంవత్సరాలు రెండుసార్లు పని చేశారు. రాజకీయాలలో ఆయన మేధావిగా ప్రసిద్ధుడు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక సదస్సులు, గోష్ఠుల్లో పాల్గొన్నారు. ప్రజోద్యమాలను నిర్మించడంలో ఆయనకు ఆయనే సాటి. ఆ క్రమంలో కటినం కొన్ని దఫాల్ల సార్లు అరెస్టయ్యారు. జైలులో ఉన్నారు. అనేక కేసులు ఎదుర్కొన్నాల్సి వచ్చింది. వామపక్ష పార్టీల ఐక్య కార్యాచరణలో భాగంగా అనేక పోరాటాలకు రూపకల్పన చేశారు. అనేక రాష్ట్రాలలో జైలు శిక్షలు అనుభవించారు. లక్నో కోల్‌కతా జైల్లలో గడపాల్సి వచ్చింది. చంద్రబాబునాయుడు హయాంలో విద్యుత్ ఉద్యమంలో ఆయన తీవ్రంగా గాయపడడమే కాక జైలులో ఉండాల్సి వచ్చింది. మునుపటి సోవియట్ యూనియన్ సహా చైనా, అఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, మంగోలియా, హంగేరి, బ్రిటన్, అమెరికా దేశాలలో పర్యటించారు. ఆంధ్రప్రదేశ్ సివిల్ లిబర్టీస్ కమిటీకి చాలాకాలం ప్రధాన కార్యదర్శిగా చేశారు. సుధాకర రెడ్డి బహు గ్రంథ రచయిత.

నాయకుడు..... తమ పార్టీకి, కేడర్‌కు, జాతి భవితకు ఓ రాడార్. తన మాటతో, చేతతో కార్యకర్తలను కదంతొక్కించడమే కాదు, తన వాదన పటిమతో ప్రత్యర్థులను ఆలోచనలో పెట్టించడం, మేధావులు, నిపుణులు, విశ్లేషకుల మద్దతు పొందడం సమర్థ నాయకత్వ లక్షణం. అధ్యయనం, అవగాహన, ఆచరణ... త్రివేణీ సంగమంగా మదిలో, హృదిలో మథనం జరిగితే తప్ప సాధ్యం కాదు. దేశ హితం కాంక్షించే దశ, దిశలో తను సాగడమే కాదు, జాతిని కదిలించగలుగుతారు. అటువంటి వ్యక్తులే నిజమైన జాతి నేతలు కాగలుగుతారు.

ప్రస్తుత రాజకీయాల్లో నేతలను విలక్షణత్వం, విశుద్ధ మార్గంతో మార్క్సిస్టు-లెనినిస్టు పంథాలో సమసమాజమే లక్ష్యంగా ముందుకు సాగిన నేత సురవరం సుధాకరరెడ్డి. మతవాద, మితవాద, బూర్జువా రాజకీయాల్లోని క్రూరత్వాన్ని, కుటిలత్వాన్ని, స్వార్థపూరిత దోపిడీ విధానాలను ఎండగడుతూ లౌకిక, ప్రజాతంత్ర శక్తులకు అండగా నిలుస్తూ భారత కమ్యూనిస్టు పార్టీకి కార్యదర్శిగా తన కర్తవ్యాన్ని త్రికరణశుద్ధిగా నిర్వహించిన, నిజమైన ప్రజా ఉద్యమ నేత ఆయన. పాతకాల స్ఫూర్తి నేటి సందర్భంలో ఎంత వరకు ఉందని ప్రశ్నించడం నేర్పున్నారు. విద్యార్థి దశ నుంచి కమ్యూనిస్టు ఉద్యమంలో పోరాడారు. తన వ్యాక్తిత్వంతో జనాకర్షక నేతగా ఎదిగారు. తన అధ్యయనం, సైద్ధాంతిక బలంతో దార్శనికునిగా పేరొందారు. భూస్వామ్య కుటుంబంలో జన్మించినా ఎటువంటి భేషజాలు లేవు. రాజకాల్లో తమ ఇంటిని అగలబెట్టినా, కుటుంబాన్ని వెంటపడినా వెరపకుండా ప్రజా ఉద్యమాలు పట్టారు. ప్రతి ప్రతిబంధకాన్ని తన పోరాటానికి నిచ్చెన మెట్లుగా మలచుకున్నారు. పాలకులు పట్టి జైల్లో పెట్టినా... ఆ సెల్‌నే ఉద్యమాలకు పుటిగదిగా మార్చుకున్నారు. ఎక్కడ ఏ సమస్య వచ్చినా కమ్యూనిస్టుగా ముందుగా స్పందించడం, దానితో పాటు తానుసైతంటూ ఆయన ప్రజాక్షేత్రంలో ఉద్యమబావుటా ఎగురవేయడం ఆయనకు నిత్యకృత్యం. పోరాటాల గడ్డ నల్లగొండ నుంచి పార్లమెంటులో అడుగుపెట్టినా... కార్యకర్త నుంచి పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎదిగినా ఆయన ఆలోచన, ఆచరణలో ఏ మార్పులేదు. నిరాడంబరత ఆయన శైలి. నల్లకుబేరుల జాతకాలపై తొలిసారి పార్లమెంట్ వేదికగా గళం విప్పిన ఘనత ఆయన సొంతం. ఎర్రజెండా చేతబట్టి దశాబ్దాలకు పైగా అలుపెరగని పోరు సాగించారు.

సీపీఐ కేంద్ర కార్యదర్శివర్గం సంతాపం

మన ప్రియమైన మాజీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ఎస్. సుధాకర్ రెడ్డి మృతికి సిపిఐ తీవ్ర దుఃఖంతో ప్రకటిస్తోంది. 1942లో జన్మించిన కామ్రేడ్ సుధాకర్ తన జీవితాంతం కార్మికవర్గం మరియు అణగారిన ప్రజల పోరాటాలకు అంకితం చేశారు, 2012 నుండి 2019 వరకు సిపిఐ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు మరియు లోక్‌సభలో రెండుసార్లు నల్గొండకు ప్రాతినిధ్యం వహించారు. ప్రజల కోసం జీవితాంతం పోరాడిన ఆయన, సిపిఐ కి, వామపక్ష ఉద్యమం మొత్తానికి ఆయన విజయం, స్పష్టత, అచంచల నిబద్ధతకు గుర్తుండిపోయారు. రెడ్ సెల్యూట్, కామ్రేడ్. మీరు మా పోరాటాలలో ఎప్పటికీ జీవిస్తారు.

గొప్పనేతను కోల్పోయాం: రామకృష్ణ

సురవరం సుధాకర్‌రెడ్డి మరణం పట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం రాత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. సురవరం సుధాకర్‌రెడ్డి మరణం బాధాకరం. తాను నమ్మిన సిద్ధాంతం కోసం, కమ్యూనిస్టు పార్టీ ఉన్నతి కోసం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం జీవిత చరమాంకం వరకు ఆయన శ్రమించారు. 2012 నుండి 2019 వరకు సీపీఐ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. నల్గొండ లోక్‌సభ నియోజకవర్గ నుంచి సీపీఐ అభ్యర్థిగా రెండు పర్యాయాలు విజయం సాధించి పార్లమెంట్‌లో ప్రజా సమస్యలపై గళమెత్తి ప్రజావాణి వినిపించారు. వామపక్ష ఉద్యమాలలో ఎనలేని పాత్ర పోషించారు. కమ్యూనిస్టు పార్టీ పురోభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి మరువలేనిది. వినయం, అచంచల నిబద్ధతకు ఆయన ప్రతీక. సుధాకర్‌రెడ్డి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు. అసర్థుల ఉపన్యాసకుడిగా, జననేతగా పేరుగాంచిన సురవరం సుధాకర్‌రెడ్డి మరణం పట్ల సిపిఐ రాష్ట్ర సమితి తరఫున ప్రగాఢ సంతాపాన్ని, ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

ప్రముఖుల సంతాపం

సురవరం సుధాకర్‌రెడ్డి మృతికి ప్రముఖులు సంతాపం ప్రకటించారు. ఆయన మరణం వామపక్ష ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు. సురవరం మృతికి సీపీఐ జాతీయ కార్యదర్శి డా.కె.నారాయణ, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ తదితరులు సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. సురవరం సుధాకర్‌రెడ్డి మృతి పట్ల అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ ఒక ప్రకటనలో సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.

ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్ : జిల్లాలోని రెడ్యాల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను జిల్లా కలెక్టర్ అద్వైత కుమార్ సింగ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాల తరగతి గదులను, చుట్టూ పరిసరాలను, టాయిలెట్స్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. విద్యార్థుల గదులను, వంటగదిని, డైనింగ్ హాలును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. తరగతి గదిలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులతో మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని, వాటిని సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు. టీచర్స్ విద్యార్థులకు అర్థమయ్యే విధంగా విద్యను బోధించాలని తెలిపారు. ఈ తనిఖీల్లో కలెక్టర్ వెంట ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఉపాధి హామీ పనుల జాతరలో కూలీకి సన్మానం



విశాలాంధ్ర - నేరేడుచర్ల : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉపాధి హామీ పనుల జాతరలో భాగంగా నేరేడు చర్ల మండలంలోని మేడారం గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పంచాయతీ అధికారి హరి సింగ్ నాయక్ మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల ద్వారా గ్రామాల్లో కనీసం ఒక పని ప్రతిరోజు ప్రారంభించ వలసిందిగా పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు. గ్రామ సభలో వికలాంగ కూలీతో పాటు ఎక్కువ పని దినాలు పూర్తిచేసిన ఎంపీడబ్ల్యు వర్కర్‌ను సన్మానించారు. అంతేకాకుండా గ్రామంలో వన మహోత్సవంలో భాగంగా చెట్లు నాటి శ్రమతో పాల్గొన్న కూలీ పేరబోయిన శ్రీనును ప్రత్యేకంగా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కట్ట రామారావు, నాయకులు పరేపల్లి సత్యనారాయణ, మామిడి వెంకటేశ్వరు, పేరబోయిన మల్లయ్య, మామిడి నరసయ్య, ముక్కంటి సురేష్, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

అంతర్గాంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర ప్రతినిధి- పెద్దపల్లి, సింగరేణి: 9 కోట్లతో అంతర్గాం మండలంలోని అంతర్గాం మండలంలలో పలు గ్రామాల్లో శుక్రవారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. టిటిఎస్, గోలివాడ, ముర్మూర్ తదితర గ్రామాలలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ సంబంధించిన సుమారు 9 కోట్ల వ్యయంతో రోడ్లు, డ్రైనేజీ, అంగన్‌వాడి బిల్డింగ్స్, గ్రామపంచాయతీ భవనాలకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా మండల కేంద్రంలో అంగన్వాడి కేంద్రాన్ని, ముర్మూర్ గ్రామంలో మినీ పాల శీతలీకరణ కేంద్రాన్ని, బల్కం మిల్క్ కూలింగ్ యూనిట్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఊరురా పనుల జాతర కార్యక్రమానికి ఈరోజు శ్రీకారం చుట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిజిడిడిసిఎఫ్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి చైర్మన్, అంతర్గాం మండల తాసిల్దార్ తుమ్ రవీందర్ గారు పంచాయతీరాజ్ తదితర సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ తరాల కోసం మొక్కలు నాటాలి : ఎస్పీ

విశాలాంధ్ర బ్యూరో - మెదక్: భవిష్యత్తు తరాల కోసం మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎస్పీ డి.వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణంలో వన మహోత్సవం నిర్వహించగా పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి ఎస్పీ మొక్కలు నాటారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వనమహోత్సవ కార్యక్రమంలో జిల్లా పోలీసులు ముందుండాలని, అన్ని పోలీసు స్టేషన్లలో 18 వేల మొక్కలు నాటాలని ఆదేశించారు. ప్రకృతికి అందం మొక్కలేననీ, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెదక్ అదనపు ఎస్పీ మహేందర్ మెదక్ డియస్పి డి.ప్రసన్న కుమార్, సైబర్ క్రైమ్ డియస్పి సుభాష్ చంద్ర బోస్, ఏఆర్ డియస్పి రంగానాథ్ ఇన్స్పెక్టర్లు మధు సుధన్ గౌడ్, ఎస్. సందీప్ రెడ్డి, ఇన్స్పెక్టర్ రాజశేఖరరెడ్డి మరియు ఆర్‌ఐలు రామ కృష్ణ, శైలందర్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యా బోధనకు చర్యలు : కలెక్టర్



విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : నిర్మల్ గ్రామీణ మండలం అనంత పేట్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టోర్‌రూమ్, వంటగది, డైనింగ్‌హాల్‌ను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యుత్, తాగునీరు, బాత్రూం వంటి సదుపాయాలు సక్రమంగా వినియోగంలో ఉన్నాయా అనే అంశాన్ని స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ప్రభుత్వ కేజీబీవీల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతులు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఇన్‌చార్జ్ డీఈఓ పరమేశ్వర్, ఎంఈఓ వెంకటేశ్వర్లు, తాహసిల్దార్ సంతోష్, ఎంపీడీవో గజానన్, కేజీబీవీ ప్రత్యేక అధికారి శ్రీలత, అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బుదేరా సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలను

తెలంగాణకే రోల్‌మోడల్‌గా మారుస్తా : మంత్రి దామోదర

విశాలాంధ్ర బ్యూరో - సంగారెడ్డి : ఆరు నెలలలో బుదేరాలోని సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలను తెలంగాణ రాష్ట్రంలో రోల్ మోడల్‌గా తీర్చిదిద్దనున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ పి.ప్రావిణ్యతో కలిసి అందోల్ నియోజకవర్గ పరిధిలోని మండలంలోని వివిధ గ్రామాలలో రూ.70 కోట్ల రూపాయలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు మంత్రి దామోదర్ రాజనర్సింహ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బుదేరా సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ బుదేరా కళాశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను మెరుగు పరిచి రానున్న ఆరు నెలల్లో కళాశాలను తెలంగాణ రాష్ట్రంలోని అన్ని కళాశాలలకు రోల్ మోడల్‌గా మార్చేలా కృషి చేయనున్నట్లు తెలిపారు. కళాశాలలో చదివే విద్యార్థులకు భద్రత కల్పించడంతో పాటు మెరుగైన వసతులు కల్పించనున్నట్లు అధునాతన సౌకర్యాలతో కూడిన ల్యాబ్‌లు, డిజిటల్ తరగతి గదులు, మెరుగైన ఫర్నిచర్, లైబ్రరీ ఏర్పాటు చేయనున్నట్లు విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు కళాశాలలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం మండలంలోని కళాశాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. మునిపల్లి మండలం అల్లాపూర్ గ్రామపంచాయతీ కార్యాల యంలో సంక్షేమ పథకాలు అమలుపై సమీక్ష జరిపి గ్రామస్తులతో మాట్లాడారు. త్వరలో సింగూరు ప్రాజెక్ట్ ను టూరిస్ట్ హబ్‌గా మార్చనున్నట్లు మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. మునిపల్లి మండలంలోని గార్లపల్లి హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం పనులు ప్రారంభించిన తర్వాత జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. బుదేరా నుండి సీరూరు వరకు సింగూరు బ్యాక్ వాటర్ వెంట రెండు లైన్ల రోడ్డు ఏర్పాటు కోసం రూ. 60 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణంలో భాగంగా గార్లపల్లిలో హై లెవెల్ వంతెన ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మునిపల్లి పర్యటన సందర్భంగా మంత్రి మండలంలో ని వివిధ గ్రామాలలో రూ. 70 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులకు మంత్రి దామోదర రాజనర్సింహ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాల చైర్మన్ అంజయ్య, సంగారెడ్డి రెవెన్యూ డివిజనల్ అధికారి రవీందర్ రెడ్డి, పంచాయతీరాజ్ అధికారులు, ఆర్ అండ్ బి అధికారులు, ఉపాధ్యాయులు ప్రిన్సిపల్స్, వివిధ శాఖల సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియా వాడండి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - మెదక్: రసాయన ఎరువులకు ధీటుగా నానో యూరియాతో అద్భుత ప్రయోజనాలు ఉన్నాయని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. శుక్రవారం తూప్రాన్ పరిధిలోని వెంకట రత్నాపూర్ గ్రామంలో వివరిస్తూ కలెక్టర్ స్వయంగా వరి పొలానికి నానో యూరియా పిచికారి చేస్తూ అవగాహన కల్పించారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్ తదితరులున్నారు.

గణపతి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి

విశాలాంధ్ర- ములుగు జిల్లా బ్యూరో : గణపతి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని, ఏటూరు నాగారం ఏఎస్పి శివం ఉపాధ్యాయ అన్నారు. శుక్రవారం ఏటూరు నాగారం పోలీస్ స్టేటస్‌లో గణపతి ఉత్సవాలు, ముస్లిం కమిటీ, తదితర కమిటీలతో, ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, సిఐ అనుముల శ్రీనివాస్, ఎస్ఐ ఎన్. రాజ్ కుమార్లతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ శివం ఉపాధ్యాయ హాజరై మాట్లాడుతూ అన్ని మండలాల్లో గణపతి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకునేందుకు ఉత్సవ కమిటీలు, పోలీసు వారికి సహకరించాలన్నారు. ప్రభుత్వ నిబంధనకు లోబడి ఉత్సవాలను, భక్తిశ్రద్ధలతో నడుపుకోవాలన్నారు. మండపాల వద్ద ఇద్దరు కమిటీ సభ్యులు వీదిగా ఉండాలని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. సిఐ శ్రీనివాస్ ఎస్ఐ రాజకుమార్, మండలంలోని గణపతి కమిటీ సభ్యులు ఆలయాల కమిటీ చైర్మన్ అల్వాల శ్రీనివాస్, పెండ్యాల ప్రభాకర్ వంగాల వీరన్న, మైనార్టీ మజీద్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ భాష తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో పనుల జాతరకు శుభారంభం

విశాలాంధ్ర - సూర్యాపేట బ్యూరో : గ్రామీణ ప్రజల జీవనోపాధుల మెరుగుదలకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఉపాధి హామీ పథకం కింద జిల్లావ్యాప్తంగా "పనుల జాతర"ను కలెక్టర్ తేజస్ నంద్ లాల్‌పవార్ శుక్రవారం ప్రారంభించారు. చివ్వెం మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనుల కు శంకుస్థాపన చేస్తూ కలెక్టర్ గ్రామీణాభివృద్ధి పట్ల ప్రభుత్వ కృతనిశ్చయాన్ని వివరించారు. ముందుగా కలెక్టర్ రెండో వార్డులో లబ్ధిదారు వడ్డేపల్లి రాములు నిర్మించిన పశువుల పాకను ప్రారంభించారు. ఈ పాక నిర్మాణానికి రూ. 78,500 వ్యయం కాగా, ఇందులో కూలి కింద రూ.12,864, మెటీరియల్ ఖర్చుగా రూ.65,595 మంజూరయినట్లు తెలిపారు. రాములుతో స్వయంగా మాట్లాడి పశువుల సంఖ్య, పాలు ఉత్పత్తి, విక్రయాలు వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ ఎలుక ప్రమీలకు మంజూరైన పశువుల పాక పనులకు శంకుస్థాపన చేసి, పనులు నాణ్యతతో తక్షణమే పూర్తి చేయాలని సూచించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వాన నీటి సంరక్షణ కట్టడం పనులు ప్రారంభించారు. డీఆర్‌డీఓ అప్పారావు, డివిజనల్ పంచాయతీ అధికారి నారాయణరెడ్డి, తహసీల్దార్ ప్రకాష్‌రావు, ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఉపాధి హామీ ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రజా సేవలో కాంగ్రెస్ నేత

విశాలాంధ్ర - గూడూరు : ఎడతెరిపి లేకుండా గతవారం రోజుల నుండి కురిసిన భారీ వర్షాలకు చెట్లు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి ఆ తండాకు వెళ్లే ప్రజలు నానా అవస్థలు పడడంతో చూసి చలించిపోయిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు ధరంసోత్ బాలు నాయక్ ప్రజల సమస్యలను పరిష్కరించి ప్రజా సేవలో ముందుంటున్నారు. గూడూరు మండలం గాజుల గట్టు శివారు హరిచంద్ర తండా పంచాయతీ రాయిని కుంట కట్టపై చెట్లు, పిచ్చి మొక్కలు భారీగా పెరిగి తండాకు వెళ్లి దారికి అడ్డుగా నిలుస్తూ ప్రజలకు ఇబ్బందులు, ప్రమాదాలు కలిగిస్తుండడంతో ధరంసోత్ బాలు నాయక్ సొంత ఖర్చులు వెచ్చించి జెసిబి సహాయంతో చెట్లను తొలగించి ప్రజల సమస్యలను పరిష్కరించారు. రోడ్లు గుంతలు పడడంతో గుంతలు కాకుండా మరమ్మత్తులు చేయించారు. బాలు నాయక్‌కు గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మాజీ సర్పంచ్ ధరంసోత్, దంజ్యా నాయక్, ధరంసోత్ గణేష్ నాయక్, గుగులోత్ మోతిలాల్, బోడ శ్రీనివాస్, ధర్మసోత్ వాలు నాయక్, బోడ గాంధి, గుగులోత్ మన్సింగ్, బోడ రాజ్యు, తేజావత్ చక్రు, ధరంసోత్ సుమన్ పాల్గొన్నారు.

గణేష్ మండపాలకు పోలీస్ అనుమతి తప్పనిసరి

విశాలాంధ్ర - కొండమల్లేపల్లి : గణేష్ మండపాలకు పోలీసు అనుమతి తప్పనిసరి అని కొండమల్లేపల్లి సీఐ నవీన్ కుమార్ అన్నారు. శుక్రవారం ఎస్సై అజ్మీర రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా కొండమల్లేపల్లి మండల పరిధిలోని వివిధ గ్రామాలలో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే వినాయక మండపాలకు పోలీసుల అనుమతి తప్పనిసరి మండపాల వద్ద డీజేలు పెట్టకూడదని రాత్రి వేళల్లో గుంపులు గుంపులుగా ఉండి ప్రజలను ఇబ్బందులను గురిచేయొద్దని ప్రశాంతమైన వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నవరాత్రులు జరుపుకోవాలని తెలిపారు ఈ సమావేశంలో ఎంపీడీఓ బాలరాజు రెడ్డి, ఎమ్మార్వో నరేందర్, కుల సంఘాలు, మత పెద్దలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు అరికట్టేందుకు కృషి చేయాలి

విశాలాంధ్ర - తొర్రూరు : సీజనల్ వ్యాధులు అరికట్టేందుకు వైద్య, ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని మాల మహానాడు యువజన విభాగం జిల్లా నాయకులు రాకేష్ యనమల, గిరిజన నాయకులు భూక్యా అరుణ్‌లు కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్వో భూక్యా రవి రాథోడ్‌ను నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. వర్షాకాలంలో గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని, ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, మందులు అందించాలని వైద్యాధికారిని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలో ఏఏ జాగ్రత్తలు పాటించాలో గ్రామీణులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, దానికి ఆరోగ్య సిబ్బంది చొరవ చూపాలన్నారు. దోమ కాటు వల్ల డెంగ్యూ, విష జ్వరాలు వస్తున్నాయని, వాటిని అరికట్టేందుకు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది చేపట్టే క్యాంపులకు యువజన విభాగాల నుండి సహకారం అందిస్తామని తెలిపారు. ఆరోగ్యహితమైన గ్రామాలను ఏర్పాటు చేసేందుకు అందరి సహకారం అవసరమని కోరారు.

అభివృద్ధి పనులు చేసేందుకే పనుల జాతర

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో : వివిధ రకాల అభివృద్ధి పనులను చేసేందుకే రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం పనుల జాతర కార్యక్రమమని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.అన్నారు. శుక్రవారం ఏటూరు నాగారం మండలంలోని చిన్నబోయిన్నపల్లి గ్రామ పంచాయతీలో పనుల జాతర ను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు తో కలిసి ఘనంగా ప్రారంబించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జాతీయ ఉపాధి హామీ పథకానికి సంబంధించి మొత్తం 266 పనులు చేపట్టబడి ఉన్నాయని, వాటిని గ్రామ ప్రజలు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి కార్మికుడు రోజుకు రూ. 307 లబ్ధి పొందే అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. చిన్నబోయినపల్లి గ్రామపంచాయతీలో రైతులకు క్యాటిల్ షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన, ఇంకుడు గుంతల నిర్మాణం, నీటి సంరక్షణ కార్యక్రమాలను ప్రారంభిం చారు. వ్యక్తిగత పనుల కింద పౌల్ట్రీ షెడ్లు, నాడెపు కంపోస్ట్ పిట్లు, అజోల్ల పెంపకం, ల్యాండ్ డెవలప్మెంట్, హార్టికల్చర్ ప్లాంటేషన్, టాయిలెట్ నిర్మాణాలు మొదలైన కార్యక్రమాలు చేపట్టాలని గ్రామస్తులకు సూచించారు.

మంగపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ : కలెక్టర్

మంగపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను జిల్లాకలెక్టర్ దివాకర టి ఎస్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని ఇన్‌బి పేషంట్ వార్డును, ల్యాబ్ టెక్నీషియన్ గదిని, డెలివరీ రూమును, మందుల నిలువలు గదిని, ఆరోగ్య కేంద్రం పరిసరాలను పరిశీలించారు. ఇన్ పేషెంట్ వార్డులో చికిత్స పొందుతున్న రోగుల వద్దకెళ్లి ఆరోగ్య పరిస్థితి వివరాలను, వారికి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు.

బీసీ రిజర్వేషన్ల అమలుకు సత్యాగ్రహ దీక్ష



విశాలాంధ్ర బ్యూరో - పెద్దపల్లి : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25న హైదరాబాదులోని ఇందిరాపార్క్ వద్ద రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య చేపట్టబోయే సత్యాగ్రహ దీక్షకు జిల్లా వ్యాప్తంగా బీసీ సంక్షేమ సంఘం నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి మద్దతు తెలపాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి మనోజ్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి తాడూరి శ్రీమన్నారాయణ కోరారు. శుక్రవారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పలువురు బీసీ సంఘం నాయకులతో కలిస సత్యాగ్రహ దీక్ష ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తాళ్లపల్లి మనోజ్ గౌడ్, తాడూరి శ్రీమన్నా రాయణ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా బీసీలు రిజర్వేషన్ల విషయంలో అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243డి(6) ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం కూడా బీసీల రిజర్వేషన్ల విషయంలో స్పష్టమైన వైఖరితో ముందుకు రావాలని డిమాండ్ చేశారు. 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు తమ పోరాటం ఆగదని, అవసరమైతే రాజకీయాలకు అతీతంగా ఉద్యమాన్ని కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు.

పౌల్ట్రీ షెడ్ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

విశాలాంధ్ర - మణుగూరు : మండల పరిధిలోని దమ్మక్కపేట పంచాయితీలో పనుల జాతర అట్టహాసంగా ప్రారంభమైంది. శుక్రవారం రెండు ముఖ్యమైన అభివృద్ధి పనులకు, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్‌తో కలిసి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శంకుస్థాపనలు చేశారు. మొదటిగా దమ్మకపేట గ్రామపంచాయితీ పరిధిలో పౌల్ట్రీ షెడ్ నిర్మాణం, తోగూడెం గ్రామపంచాయితీ పరిధిలో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌కు ఎమ్మెల్యే పాయం భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పనుల జాతరను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ఒక ప్రత్యేక అభివృద్ధి ప్రణాళిక ఈ జాతర అన్నారు. గ్రామీణాభివృద్ధిని వేగవంతం చేయడం, ఉపాధి హామీ పథకం పనులను మరింత చురుకుగా అమలు చేయడం దీని ప్రధాన లక్ష్యమన్నారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు నిర్మించడం జరుగుతుందన్నారు. మట్టిరోడ్లు, పశుగ్రాస పంటల అభివృద్ధి, వ్యవసాయానికి అనుకూలమైన చెరువులు, వాగులు, రోడ్లు, పౌల్ట్రీ షెడ్లు, కమ్యూనిటీ భవనాలు, శానిటరీ కాంప్లెక్స్ లాంటి పనులు చేయడం జరుతుందని వివరించారు. ఇది ఒక పండుగ వాతావరణంలో నిర్వహించబడుతుందన్నారు. మండల అభివృద్ధి అధికారి తేళ్ళూరి శ్రీనివాసరావు, ఎంపిఓ వెంకటేశ్వర రావు, తహశీల్దార్ నరేష్, రెవెన్యూ సిబ్బంది, గ్రామపంచాయితీ సెక్రటరీ లు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిరినాకి నవీన్ పాల్గొన్నారు.

సీపీఐ శ్రేణుల్లో హర్షాతిరేకాలు

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : జిల్లా కేంద్రం కొత్తగూడెం నివాసి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా మళ్ళీ ఎన్నికవడంపై సీపీఐ శ్రేణుల్లో హర్షాతిరేకం వ్యక్తమవుతోంది. మేడ్చల్ జిల్లా గాజులరామవరంలో మూడు రోజుల పాటు జరిగిన మహాసభలో కూనంనేని ఎన్నికైనట్లు ప్రకటించారు. దీంతో రెండవసారి రాష్ట్ర కార్యదర్శి పగ్గాలు చేపట్టనున్నారు. దీంతో జిల్లాలోని సిపిఐ క్యాడర్లో ఆనందం, సంతోషం వ్యక్తంమౌవుతుంది. జిల్లాకు చెందిన కూనంనేని ఐదు దశాబ్దాలుగా సీపీఐ పార్టీలో కీలకపాత్ర పోషిస్తూ వస్తున్నారు. 2005 నుంచి 2009 వరకు ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. 2009లో కొత్తగూడెం నియోజకవర్గం నుంచి పోటీ చేసి అప్పటి మంత్రి వనమా వెంకటేశ్వరరావుపై ఎమ్మెల్యేగా గెలిశారు. తిరిగి 2023 లో కొత్తగూడెం నియోజకవర్గం నుంచి రెండవ సారి ఎమ్మెల్యేగా ఎన్నికై కొనసాగుతున్నారు. రాష్ట్ర కార్యదర్శిగా గడిచిన మూడేళ్లలో రంగారెడ్డి, వరంగల్, హనుమకొండ, భూపాలపల్లి, మేడ్చెల్, మహబూబాబాద్ జిల్లాలో అనేక భూపోరాటాలు నిర్వహించి ఇండ్లు లేని పేదలకు ఇండ్ల స్థలాలు, సాగుభూమిని ఇప్పించి పంపిణీ చేశారు. వామపక్షం నుంచి ఒకేఒక్క శాసనసభ్యుడిగా ఉన్న కూనంనేని అసెంబ్లీ సమావేశాల్లో అయన చేసిన ప్రసంగాలు, సమస్యల ప్రస్తావన సాధించిన అభివృద్ధి అంశాలు కూనంనేనికి అన్ని వర్గాల నుంచి ప్రసంశలు కురిపించాయి. 2023లో జరిగిన సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లోనూ సిపిఐ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గుర్తింపు సంఘంగా గెలుపొందడంలో ఆయన కీలక పాత్ర వహించారు. కొత్తగూడెం నియోజకవర్గంలో ఎక్కువసంఖ్యలో స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు గెలిపించడంలో అయన పత్రే ముఖ్యంగా వుంది. కూనంనేని రెండో సారి రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికకావడం పట్ల పార్టీ శ్రేణుల్లో, రాజకీయాలకతీతంగా అభిమానుల్లో కూడా హర్షం వ్యక్తం అవుతుంది.

గురుకులాల నిర్వహణ నిర్లక్ష్యం చేయకండి

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : జిల్లాలోని గురుకుల పాఠశాలలు కళాశాలల పట్ల నిర్లక్ష్యం చేయకుండా విద్యార్థులకు మెరుగైన విద్యాభ్యాసం చేయించాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. శుక్రవారం మణుగూరు లోని మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాల, తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల తోపాటు వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ తరగతి గదులు, భోజనశాల, వసతి గృహాలు, పాఠశాల పరిసరాలను సమగ్రంగా పరిశీలించారు. హాస్టల్ తనిఖీ సమయంలో విద్యార్థులతో సమస్యలపై ప్రత్యక్షంగా ముచ్చటించారు. వసతి సౌకర్యాలు, పరిశుభ్రత, త్రాగునీరు, మంచం, దుప్పట్లు, స్నానాల గదులు తదితర అంశాలపై వివరాలు తెలుకొని పరిశీలించారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల చదువుపై ఆసక్తి, ఉపాధ్యాయుల బోధన నాణ్యత, అభ్యాస స్థాయి పై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని, ప్రభుత్వమందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. నాణ్యమైన భోజనం అందించాలని శుభ్రత, భద్రత పై కూడా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వం లక్ష్యం

విశాలాంధ్ర- పినపాక : ప్రజాభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో పనుల జాతర 2025 కార్యక్రమం నిర్వహిస్తుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజల భాగస్వామ్యం, స్వయం ఉపాధి కల్పన, ప్రభుత్వాల సహకారంతో జరుగుతున్నాయని తెలిపారు. శుక్రవారం పినపాక మండలంలోని సీతారాంపురం గ్రామంలో పనుల జాతర ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తోపాటు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ హాజరైయ్యారు. అంగన్వాడి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్, స్వచ్ఛభారత్ మిషన్, పంచాయతీరాజ్ విభాగం ఆర్డబ్ల్యూఎస్ శాఖల ద్వారా కొత్త పనులను ఏకకాలంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించే ఉద్దేశమే ఈ జాతర కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. ఇందులో ఇందిరా మహిళా శక్తి, ఉపాధి భరోసా పథకం కింద పశువుల పాకలు, గొర్రెల షెడ్లు, కాంపోస్టు గుంటలు, కోళ్ల ఫారాలు, పొలం బాటలు పథకం కింద నర్సరీల పెంపకం, జల నిధి పథకం కింద చెక్ డ్యాములు, ఫారం పాండ్లు, ఊట కుంటలు, గ్రామీణ మౌలిక వసతులు కార్యక్రమంలో సిసి రోడ్లు, అంగన్వాడీ భవనాలు మొదలు పనులను నిర్వహించనున్నట్లు తెలిపారు. స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా ప్లాస్టిక్ వేస్ట్ యూనిట్, సెగ్రిగేషన్ షెడ్స్, కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్, అంగన్వాడి టాయిలెట్లు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ద్వారా గ్రామీణ రహదారుల నిర్మాణం పనులు ప్రారంభించుకోవచ్చని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రూ 2199 కోట్ల నిధులతో పనులు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. పినపాక మండల ప్రత్యేక అధికారి ఏడిఏ బి. తాతారావు, తహశీల్దార్ జి. గోపాలకృష్ణ, ఎంపీడీవో సునీల్ కుమార్, ఎంపీఓ కే. వెంకటేశ్వరరావు, పి ఆర్ డి ఈ వస్యా నాయక్, ఏఈ వంశీ, ఎంఈఓ కే నాగయ్య, ఐసిడిఎస్ సిడిపిఓ జయలక్ష్మి, ఏపీవో వీరభద్ర స్వామి, పంచాయతీ సెక్రటరీలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కళాశాలకు నూతన తరగతి గదులు కేటాయించాలి

విశాలాంధ్ర - కొత్తగూడెం : కొత్తగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అదనపు తరగతి గదులు నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మంద నాగకృష్ణ కోరారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న నాగక్రిష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల సమస్యల పట్ల నిర్లక్ష్యం చేయకుండా వసతులు కల్పించాలని కోరారు. వొకేషనల్ తరగతి గదులు, ఆర్ట్స్ విభాగం తరగతి గదులు శిధిలావస్థకు చేరుకున్నాయన్నారు. వర్షం వస్తే గోడలకు నీరు చేరి ప్రమాదకరంగా ఉన్నాయని చెప్పారు. తడిగా ఉన్న ఈ గోడల ద్వారా విద్యుత్ ప్రచారం అయ్యే ప్రమాదం కూడా ఉందన్నారు. శిధిలావస్థకు చేరిన తరగతి గదుల స్థానంలో నూతన తరగతి గదులు కేటాయించాలన్నారు. కళాశాలకు దగ్గరలో బాయ్స్ హాస్టల్ ను ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులకు భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో 12 మందితో ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగిందన్నారు. కళాశాల అధ్యక్షకార్యదర్శులుగా హర్షవర్ధన్, సతీష్, గర్ల్స్ కన్వీనర్ గా శ్యామలను ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు రిశ్వంత్, మౌలాలి, విఘ్నేష్, సతీష్ పాల్గొన్నారు.

ఘనంగా పోలాల పండుగ

విశాలాంధ్ర - కొమరం భీం : జిల్లాలో అన్నదాతకు సాగులో తోడుండే మూగజీవాలను కొలిచే పొలాల అమావాస్యను శుక్రవారం మండలంలోనీ విర్దండి గ్రామంలో ఘనంగా జరుపుకున్నారు. పూల దండలు, గజ్జెలు, కొత్త కన్నాలతో బసవన్నలకు ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలను సమర్పించారు. ఎడ్లతో దేవాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయించి మొక్కులు చెల్లించారు. బసవన్నలను ఆలయాలకు తీసుకెళ్లారు. పల్లెలు పాడిపంటలతో సుభిక్షంగా ఉండేలా చూడాలని దైవాన్ని వేడుకున్నామని రైతులు పేర్కొన్నారు.

సంపాదకీయం

ప్రశ్నించడమే దేశద్రోహం

దేశ ద్రోహం, జాతీయ సమగ్రత మొదలైన అంశాలను పరిరక్షించే బాధ్యతను అసోం ముఖ్యమంత్రి హేమంత బిస్వశర్మ గుత్తకు తీసుకున్నట్టున్నారు. "ది వైర్" సంపాదకులు సిద్ధార్థ వరదరాజన్, కరణ్ థాపర్‌పై అసోంలో కేసు నమోదు చేశారు. వారిని కోర్టుకు హాజరు కావాల్సిందిగా ఆదేశించారు. అయితే వారిని అరెస్టు చేయడం లాంటి తీవ్ర చర్యలేవీ తీసుకోకూడదని సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ వ్యవహారం జరిగి రెండు రోజులైనా గడవక ముందే యూట్యూబ్‌లో కార్యక్రమాలుచేసే మరో సీనియర్ జర్నలిస్ట్ అభిసార్ శర్మ మీద కూడా ఎఫ్ఐఆర్ నమోదైంది. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ పని తీరును ప్రశ్నించే హక్కు పత్రికా రచయితలకు ఉంటుంది. కానీ బీజేపీ అధికారంలో ఉన్న చోట ఆ హక్కుకు అడుగడుగునా అడ్డు పడుతుంటారు. ఎఫ్ఐఆర్ ఎదుర్కోవాల్సిన ముగ్గురు పత్రికా రచయితలు చేసిన పని ప్రభుత్వాన్ని ప్రశ్నించడమే. ప్రభుత్వాన్ని ప్రశ్నించినా, లోటుపాట్లను ఎత్తి చూపినా పత్రికా రచయితలపై దేశ ద్రోహం కేసులు మోపడం పరిపాటి అయిపోయింది. ఇలాంటి కేసులు నమోదు చేయడంలో అసోం ముఖ్యమంత్రి ఎప్పుడూ అత్యుత్సాహం చూపిస్తుంటారు. ఆయన కేసులు మోపడానికి అనువుగా ఆర్ఎస్ఎస్ అనుబంధ విద్యార్థి సమాఖ్య ఏబీవీపీ ఫిర్యాదులు దాఖలు చేస్తూ ఉంటుంది. సమాజంలో శాంతి, జాతీయ సమగ్రత, భద్రత మొదలైన అంశాల ఆసరాగా కేసులు మోపుతూ ఉంటారు. ఇలాంటి కేసులు మోపడంలో హేమంత బిశ్వ శర్మ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం సకల నియమాలను, పరిధులను బాహాటంగా ఉల్లంఘిస్తోంది. విచిత్రం ఏమిటంటే కొత్తగా అమలులోకి వచ్చిన భారతీయ న్యాయ సంహితలోని 152వ సెక్షన్ రాజ్యాంగ రీత్యా చెల్లదని దాఖలైన కేసులో సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసిన రోజే సిద్ధార్థ వరద రాజన్, కరణ్ థాపర్ మీద కేసులు మోపారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో మన యుద్ధ విమానాలు ఎన్ని కూలాయో మలేషియాలో మన సైనిక ప్రతినిధి వివరాలు అందించిన విషయమై "ది వైర్"లో ప్రస్తావించినందుకు వైర్ సంపాదకులు సిద్ధార్థ వాదరాజన్, కరణ్ థాపర్ మీద కేసులు మోపారు. ఇది యాదృచ్ఛికం అనుకోలేం. ఇలాంటి వ్యాసం దేశ భద్రతకు, ఐక్యత, సమగ్రతలకు విఘాతం కలిగిస్తుందా అని గత 12వ తేదీన విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి సూర్యకాంత్ ప్రశ్నించారు. దానికి జవాబుగానా అన్నట్టు అభిసార్ శర్మ మీద కూడా కేసు నమోదైంది. హేమంత్ బిశ్వశర్మ మతతత్వాన్ని రెచ్చగొట్టే రీతిలో పరిపాలిస్తున్నారని అభిసార్ శర్మ అన్నారు. అది ఏబీవీపీ గుండెలో గుచ్చుకున్నట్టుంది. వెంటనే ఫిర్యాదు చేసింది. కనీస మౌలిక దర్యాప్తు కూడా లేకుండా అసోం ప్రభుత్వం ఆయన మీద కేసు మోపింది. భారతీయ న్యాయ సంహిత రూపొందక ముందు నుంచే దేశ ద్రోహం కేసులు మోపడానికి అప్పటి భారత శిక్షాస్మృతిలోని 124ఎ సెక్షన్ పై దుమారం రేగుతూనే ఉంది. బీజేపీ నాయకులు కూడా విమర్శలకు దిగారు. భయంకరమైన ఈ సెక్షన్‌ను భారత శిక్షాస్మృతిని సంస్కరించాలని అనేక మంది చాలా కాలంగా కోరుతూనే ఉన్నారు. మోదీ ప్రభుత్వం దాన్ని తొలగించకపోగా 124ఎ సెక్షన్‌ను యథాతథంగా ఉంచేసి దానికి భారతీయ న్యాయ సంహితలో 152వ సెక్షన్‌గా చేర్చింది. ఈ సెక్షన్‌ను దుర్వినియోగంచేసే అవకాశం ఉందని లా కమిషన్ ముందే ఊహించింది. దేశద్రోహం ఆరోపణ మోపుతున్న వారి మీద పోలీసులు దర్యాప్తుచేసి ఏడు రోజుల్లోగా నివేదిక అందించే సదుపాయం ఉండాలని లా కమిషన్ సూచించింది. మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన భారతీయ న్యాయ సంహితలో ఈ వెసులుబాట్లేవీ లేవు. ఈ ఎఫ్ఐఆర్ ఎవరి మీద దాఖలు చేశారో వారికి ఆ ప్రతిని అందజేయాలన్న సూచననూ పాటించడం లేదు. సీనియర్ జర్నలిస్టులు చేసిన పనల్లా ఆపరేషన్ సిందూర్ సమయంలో మనం కొన్ని యుద్ధ విమానాలు కోల్పోయాం అని మలేషియాలో విమాన సైనిక ప్రతినిధి చెప్పిన వివరాల ప్రకారం ది వైర్‌లో వార్త రాయడమే. చర్చ చేయడమే. ఇది దేశ సార్వభౌమాధికారానికి, ఐక్యతకు, సమగ్రతకు విఘాతం కలిగిస్తుందట. ఇంతకూ మనం కొన్ని యుద్ధ విమానాలు కోల్పోయాం అని వెల్లడించిన సైనికాధికారిపై ఏం చర్య తీసుకున్నారో తెలియదు. ఆ తరవాత త్రివిధ దళాల అధిపతి ఇదే సమాచారం బయట పెట్టారు. సైనికాధికారులు చెప్పిన వివరాల ఆధారంగా వార్తలు రాయడం ఏ లెక్కన దేశద్రోహం అవుతుందో!

మీడియా సంస్థలు వెలువర్చే వార్తలు, వ్యాసాల్లో తప్పులు ఉండవచ్చు. అంతమాత్రాన దేశద్రోహం కేసు మోపవలసిన అవసరం లేనేలేదు. ఇతర చట్టాలు అనేకం ఉన్నాయి. వాటి ఆధారంగా చర్య తీసుకోవచ్చు. కానీ ప్రభుత్వం చీటికి మాటికీ దేశద్రోహం కేసులు మోపుతోంది. చాలా సందర్భాలలో ఆ ఆరోపణకు గురైనవారిని అరెస్టుచేసి ఎలాంటి విచారణ లేకుండానే, అసలు కోర్టులో హాజరు పరచకుండానే ఏళ్ల తరబడి జైల్లో మగ్గేట్టు చేస్తోంది. ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిని వేధించడం కోసమే ఈ పద్ధతి అనుసరిస్తున్నారు. ఏకంగా దేశద్రోహం కేసు మోపడంవల్ల ప్రజాస్వామ్యాన్ని పనిగట్టుకుని బలహీన పరచడమే. మునుపున్న భారత శిక్షా స్మృతిలోని సెక్షన్ 124ఎ వలసవాద పాలనలో విపరీతంగా దుర్వినియోగం అయింది. స్వాతంత్ర్యం వచ్చిన తరవాత ఆ సెక్షన్‌ను తొలగించాల్సింది. అనేకమంది జాతీయ నాయకుల మీద బ్రిటిష్ వారు దేశద్రోహం కేసులు మోపారు. వలసవాదుల దృష్టిలో స్వాతంత్ర్య పోరాటం దేశద్రోహం కావచ్చు. కాని స్వతంత్ర దేశంలో దేశద్రోహానికి ఆస్కారమే ఉండకూడదు. అయితే రాజకీయ ప్రత్యర్థులపై కక్ష తీర్చుకోవడానికి ఈ సెక్షన్‌ను చట్టం నుంచి తొలగించనేలేదు. పేరు మార్చి బీజేపీ ప్రభుత్వం ఆ సెక్షన్‌ను భారతీయ న్యాయ సంహితలో పదిలంగా ఉంచేసింది. 2016 నుంచి దేశద్రోహ కేసులను ఎడాపెడా మోపుతున్నారు. ఈ దుర్వినియోగాన్ని సవాలుచేస్తూ సీనియర్ జర్నలిస్ట్ శశి కుమార్ 2021లో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ సాగుతోంది. దేశద్రోహ చట్టాన్ని వలసవాదులను మించి దుర్వినియోగం చేస్తున్నారు. మరీ విచిత్రం ఏమిటంటే సిద్ధార్థ వరద రాజన్, కరణ్ థాపర్ పై దురుసైన చర్య తీసుకోకూడదని సుప్రీంకోర్టు ఉత్తర్వు జారీ చేసిన తరవాత వారికి సమన్లు జారీ చేశారు. బీజేపీ అధికారంలో ఉన్నచోట అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలను కూడా ఖాతరు చేయరు.

తొలి దశాబ్ది - ఆంధ్ర కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం

చవెరా

1920 ప్రాంతంలో దేశంలో ఏర్పడిన వివిధ కమ్యూనిస్టు గ్రూపులు 1925 డిసెంబరు 26 న పారిశ్రామిక పట్టణం కాన్పూరులో సమావేశమై సోషలిజం లక్ష్యంగా భారత కమ్యూనిస్టు పార్టీ పేరుతో మహాసభ నిర్వహించి నాయకత్వ కమిటీ ఎన్నుకున్నారు. ఆ తరువాత దేశం వివిధ ప్రాంతాలలోకి కమ్యూనిస్టు పార్టీ విస్తరించింది. ఆంధ్ర రాష్ట్రంలో 1934 నాటికి కమ్యూనిస్టు ఉద్యమం ప్రవేశించింది. 1930-32 ప్రాంతంలో సత్యాగ్రహోద్యమంలో పాల్గొని జైళ్లకు వెళ్లిన కాంగ్రెసులోని అతివాదులు కాంగ్రెసు కార్యక్రమంపై అసంతృప్తితో సోషలిస్టు సాహిత్యం చదివి కమ్యూనిస్టు పార్టీలోకి వచ్చారు. ఈ క్రమంలో ఆంధ్ర ప్రాంతం నుంచి జైళ్లకు వెళ్లిన వారికి అదే జైళ్లలో ఉన్న లాహోరు కుట్ర కేసు ఖైదీలు, బెంగాల్ విప్లవకారులు ప్రతుల్‌చంద్ర భట్టాచార్య, విజయకుమార్ సిన్హా, శివవర్మ వంటి వారితో పరిచయాలు ఏర్పడి వారి ప్రభావంతో సోషలిజం వైపు ఆకర్షితులయ్యారు. జైలు నుంచి వచ్చిన తరువాత వీరందరూ కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం స్వీకరించారు.

బెనారసు విశ్వవిద్యాలయంలో, దేశీ విద్యాపీఠ్‌లోను చదువుకోసం వెళ్లిన చంద్ర రాజేశ్వరరావు, పొన్నం వీరరాఘవయ్య, తుమ్మల వెంకట్రామయ్య, కాట్రగడ్డ వెంకటనారాయణరావు, పోలేపెద్ది నర్సింహమూర్తి, పులుపుల శివయ్య, నండూరి ప్రసాదరావు, యాళ్లబండి పోలిశెట్టి, సోమూరి వెంకట్రామయ్య, చంద్ర రామలింగయ్య, సీఎల్ రాయుడు, కాట్రగడ్డ శ్రీనివాసరావు, మొదలైన 50 మంది అక్కడ యంగ్ కమ్యూనిస్టులీగ్‌లో చేరి, మార్క్సిస్టు అధ్యయన తరగతిలో పాల్గొని కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం స్వీకరించారు.

మీరట్ కుట్ర కేసులో ముద్దాయిగా ఉన్న అమీర్ హైదర్‌ఖాన్ అరెస్టు నుంచి తప్పించుకుని రహస్యంగా మద్రాసులో ఉంటూ యంగ్ వర్కర్స్ లీగ్‌ను స్థాపించారు. ఆంధ్ర ప్రాంతానికి చెందిన కంభంపాటి సత్యనారాయణ, పుచ్చలపల్లి సుందరయ్య, హెచ్‌డీ రాజా పరిచయంతో 1930లోనే కమ్యూనిస్టులుగా మారి 1932లో హైదర్‌ఖాన్ సహచర్య కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం స్వీకరించారు. ఈ మూడు స్రవంతుల ద్వారా ప్రభావితులైనవారు 1934 ప్రాంతంలో ఆంధ్ర రాష్ట్ర కమ్యూనిస్టు ఉద్యమానికి పునాదులు వేశారు. ఆంధ్రప్రాంతంలోని వివిధ జిల్లాలలో కమ్యూనిస్టు పార్టీ శాఖల నిర్మాణానికి వీరు పూనుకున్నారు. ఈ విధంగా కమ్యూనిస్టు ఉద్యమంలోకి వచ్చిన వారితో విజయవాడ పడమటలో కాట్రగడ్డ నారాయణరావు తోటలో 1934 సెప్టెంబరులో ఒక సమావేశం జరిపి పుచ్చలపల్లి సుందరయ్య కార్యదర్శిగా, ఏడుగురు సభ్యులతో ఆంధ్ర రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ ఆర్గనైజింగ్ కమిటీ ఏర్పడింది. సుందరయ్యతో పాటు మద్దుకూరి చంద్రశేఖరరావు, పోలేపెద్ది నరసింహమూర్తి, చలసాని వాసుదేవరావు, తనికెళ్ల వెంకటచలపతి, కొసరాజు శేషయ్య, అల్లూరి సత్యనారాయణరాజు కమిటీ సభ్యులుగా ఉన్నారు.

బ్రిటీష్ ప్రభుత్వం 1934 జులై 23న భారత కమ్యూనిస్టు పార్టీని నిషేధించింది. 1934 సెప్టెంబరు 20న మద్రాసు ప్రభుత్వం యంగ్ వర్కర్స్ లీగ్‌ను కూడా నిషేధించారు. దీనితో ఆంధ్ర రాష్ట్రంలోని కమ్యూనిస్టు పార్టీ సభ్యులు వివిధ పట్టణాలలో కూలి రక్షణ సమితి పేరుతో సంఘాలను ఏర్పాటుచేసి కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమాలను నిర్వహించారు. కార్మిక సంఘాల నిర్మాణంతో పాటు సోషలిజం భావాలను ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆగ్రహానికి గురై అనేక మంది పార్టీ నాయకులు అరెస్టు అయి, జైలు జీవితం అనుభవించారు. ఈ క్రమంలో గుంటూరులో 1935 ఆగస్టులో ఒక రాజకీయ పాఠశాలను నెలరోజుల పాటు పార్టీ కార్యకర్తల కోసం నడిపారు. 1936 జనవరి 29 వ తేదీ కాకినాడ అన్నదాన సమాజ సత్రంలో ఆంధ్ర రాష్ట్ర ప్రథమ కమ్యూనిస్టు పార్టీ మహాసభ జరిగింది. మొత్తం పార్టీ సభ్యులు 40 మందిలో 10 మంది ఈ సభలో పాల్గొన్నారు. పార్టీ కేంద్ర కమిటీ నుంచి ఎస్‌వి ఘాటే పాల్గొన్నారు. సుందరయ్యగారు తిరిగి కార్యదర్శిగా ఎన్నికైనా జూన్‌లో అరెస్టు కావటం వల్ల పోలేపెద్ది నరసింహమూర్తి కార్యదర్శి బాధ్యతలు నిర్వహించారు. కేంద్ర పార్టీ సూచన మేరకు రాష్ట్రంలో కాంగెస్ సోషలిస్టు పార్టీ, కాంగ్రెసు పార్టీలలో భాగస్వాములుగా ఉంటూ కమ్యూనిస్టులు పనిచేశారు. ఇది ఐక్య సంఘటన ఎత్తుగడలలో ఒక భాగం. 1936 సెప్టెంబరులో జరిగిన రాజమండ్రి ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టు పార్టీ 2 వ మహాసభ, 1937 నవంబరులో పాలకొల్లులో జరిగిన 3 వ మహాసభలలో కమ్యూనిస్టుల ప్రాబల్యం బాగా పెరిగింది. పాలకొల్లులో సుందరయ్య కార్యదర్శిగా ఎన్నికయ్యారు. కార్యవర్గం 14 మందిలో



> 1934 సెప్టెంబరులో ఒక సమావేశం జరిపి పుచ్చలపల్లి సుందరయ్య కార్యదర్శిగా, ఏడుగురు సభ్యులతో ఆంధ్ర రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ ఆర్గనైజింగ్ కమిటీ ఏర్పడింది. సుందరయ్యతో పాటు మద్దుకూరి చంద్రశేఖరరావు, పోలేపెద్ది నరసింహమూర్తి, చలసాని వాసుదేవరావు, తనికెళ్ల వెంకటచలపతి, కొసరాజు శేషయ్య, అల్లూరి సత్యనారాయణరాజు కమిటీ సభ్యులుగా ఉన్నారు

12 మంది కమ్యూనిస్టులే ఎన్నికయ్యారు. దీని ప్రభావంతో త్రిపుర కాంగ్రెస్ మహాసభలో అధ్యక్ష స్థానానికి జరిగిన ఎన్నికలలో ఆంధ్ర రాష్ట్రానికి చెందిన పట్టాభి సీతారామయ్యను కాదని అతివాదులైన కమ్యూనిస్టులు సుభాశ్‌చంద్రబోస్‌కు ఓటు వేయటంతో పట్టాభి ఓటమి పాలయ్యారు. 1937 రాష్ట్ర శాసన సభ ఎన్నికలలో కాంగ్రెసు అభ్యర్థులకు అనుకూలంగా కమ్యూనిస్టులు పనిచేశారు.

1937 మేలో ఒంగోలు సమీపంలోని కొత్తపట్నంలో పార్టీ రాజకీయ పాఠశాల ఒకటి జరిగింది. 180 మంది యువతీ, యువకులు పాల్గొన్నారు. ఈ పాఠశాలను ప్రభుత్వం నిషేధించింది. పోలీసులు విద్యార్థులపై అమానుషంగా లాఠీచార్జి చేసి, అనేక మందిని అరెస్టు చేసి కేసులు పెట్టారు. 1938లో బాపట్ల తాలూకా మంతెనవారి పాలెంలో మరో పాఠశాల నిర్వహించారు. 300 మంది హాజరయ్యారు. పార్టీ కార్యకర్తలకు మార్క్సిస్టు అర్థశాస్త్రం, చారిత్రక భౌతికవాదం, గతితార్కిక భౌతికవాదం వంటి మార్క్సిస్టు మూల సూత్రాలతో పాటు, భారత జాతీయోద్యమ చరిత్ర, కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం వర్గ సంఘాల వంటి అంశాలను బోధించి వారిలో అవగాహన పెంచేందుకు, ఎందరో యువకులు పార్టీ పట్ల ఆకర్షితులు కావటానికి ఈ పాఠశాలలు ఉపయోగపడ్డాయి. ఈ కాలంలోనే పార్టీ రహస్యంగా నిర్వహించిన పత్రికలు ప్రజలలో రాజకీయ చైతన్యాన్ని పెంపొందించాయి. ఇంగ్లీషులో రహస్య పత్రిక 'కమ్యూనిస్టు', బహిరంగంగా వచ్చే 'న్యూఏజ్' మాస పత్రిక, 'నేషనల్ ఫ్రంట్' వంటి పత్రికలు ప్రముఖమైనవి. తెలుగులో రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ తరుపున 'నవశక్తి' వారపత్రికగా 1937 డిసెంబరు నుంచి 1939 సెప్టెంబరులో రెండవ ప్రపంచ యుద్ధం వరకు నడిచాయి. ఈ కాలంలో మార్క్సిస్టు సాహిత్యం ప్రచురించి ప్రజలకు అందించారు. రాజకీయ పాఠశాలలు, పార్టీ రహస్య పత్రికలు, పార్టీ సభ్యులు, నాయకుల నిరంతర శ్రమ, ప్రజలతో మమేకమై చేసిన కృషి ఫలితంగా రాష్ట్రంలో పార్టీ విస్తరించి సభ్యత్వం వందల సంఖ్యకు చేరింది. ఈ స్థితిలో ఆంధ్ర రాష్ట్ర కమ్యూనిస్టు కమిటీ రెండో మహాసభ విజయవాడలోని నవశక్తి పత్రిక కార్యాలయంలో జరిగింది. రాష్ట్రం వివిధ ప్రాంతాల నుంచి 200 మంది పార్టీ సభ్యులకు ప్రాతినిధ్యం వహించే 60 మంది ప్రతినిధులు మహాసభలో పాల్గొన్నారు. పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి పీసీ జోషీ మహాసభలో పాల్గొన్నారు. ఈ మహాసభలో ఆరు పత్రాలను ఆమోదించి పార్టీ సభ్యులు పని చేయటానికి మార్గ నిర్దేశం చేశారు. ఈ మహాసభ స్ఫూర్తితో యువజన, మహిళా సంఘాల నిర్మాణం ప్రారంభమైంది. మహాసభ నూతనంగా ఏడుగురు సభ్యులతో పుచ్చలపల్లి సుందరయ్య కార్యదర్శిగా, చంద్ర రాజేశ్వరరావు, మద్దుకూరి చంద్రశేఖరరావు, చలసాని వాసుదేవరావు, అల్లూరి సత్యనారాయణ, పోలేపెద్ది నరసింహమూర్తి, పులుపుల వెంకట శివయ్య సభ్యులుగా నూతన కమిటీ ఎన్నుకుంది.

ఈ మహాసభ తదనంతరం పార్టీ రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు విస్తరించింది. కృష్ణా, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాల్లో ఎక్కువగా, నెల్లూరు , విశాఖ (విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం అంతా ఆనాడు ఒకే జిల్లా) జిల్లాలలో, తరువాత అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాలలో పాక్షికంగా పార్టీ విస్తరించింది. తొలి రోజులలో కార్మిక రంగంపై ఎక్కువ కేంద్రీకరణ ఉండేది. అన్ని ప్రధాన పట్టణాలలో కూలి రక్షణ సమితుల పేరుతో కార్మిక సంఘాల నిర్మాణం జరిగింది. ప్రెస్ కార్మికులు, బియ్యం, నూనె మిల్లు కార్మికులకు, జట్ల, లాగుడు బళ్ల కార్మికులకు, మున్సిపల్ కార్మికులకు, రిక్షా కార్మికులకు, పీచు, రేవు, పొగాకు, సిమెంట్ కార్మికులకు సంఘాలు ఏర్పాటు అయ్యాయి. కమ్యూనిస్టులకు బలమైన కేంద్రాలుగా కార్మికవాడలు ఆవిర్భవించాయి. 1937లో గుంటూరులో ఆంధ్ర రాష్ట్ర విద్యార్థి సంఘం 14 వ మహాసభను కమ్యూనిస్టు విద్యార్థుల చొరవతో నిర్వహించారు. ఈ మహాసభ విద్యార్థి ఉద్యమంలో ఒక మైలురాయిగా నిలిచింది. డిటెన్షన్ విధానంపైన, స్వాతంత్ర్యం కోసం చారిత్రక సమ్మెల వెల్లువ ప్రారంభమైంది. 1936-37 ప్రాంతాలలో రాష్ట్రమంతా యువజనోద్యమం విస్తరించింది. సంఘ సేవలో తర్ఫీదుతో పాటు ఆటల పోటీలు యువకులలో విప్లవ చైతన్యం కల్పించటం, అక్షరాస్యత కల్పించటం లక్ష్యాలుగా యువజన సంఘాలు పనిచేశాయి. రాష్ట్రంలో ముందుగా సుందరయ్యగారి స్వగ్రామం అలగానిపాడులో వ్యవసాయ కార్మిక సంఘం ఏర్పడింది. తరువాత దావులూరులో, గుంటూరుజిల్లా పల్లెకోన, కృష్ణాజిల్లా వీరులపాడులలో సంఘాలు ఏర్పడ్డాయి. 1937లో నెల్లూరులో ఆంధ్రరాష్ట్ర వ్యవసాయ కూలీ సంఘం ఏర్పడింది. అనేక గ్రామాలలో వ్యవసాయ కార్మికుల కూలి సమ్మెలు, పాలేర్ల సమ్మెలు జరిగాయి. 1930వ దశకంలో రైతులు ఆంధ్ర రాష్ట్రంలో వర్గ సంఘాలుగా ఏర్పడ్డారు. 1936 లో రాష్ట్ర రైతు సంఘం రిజిస్టరు చేశారు. 5 వ, 6 వ రాష్ట్ర రైతు మహాసభలు నిడబ్రోలులో జరిగాయి. చలసాని వాసుదేవరావు, కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికయ్యారు. 1937 రక్షణ యాత్ర రాష్ట్రంలో రైతాంగాన్ని చైతన్యపరచి మేల్కొలిపింది.

రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ మూడో మహాసభ 1943 లో విజయవాడలో జరిగే నాటికి పార్టీ సభ్యత్వం వేల సంఖ్యలోకి వచ్చింది. ప్రజా సంఘాల ద్వారా పార్టీ బాగా విస్తరించింది. వివిధ వర్గాల సమస్యలపై ఉద్యమించింది. ఈ మహాసభ బహిరంగంగా జరిగిన తొలి సభ. చంద్ర రాజేశ్వరరావు కార్యదర్శిగా ఏడుగురితో నూతన రాష్ట్ర కమిటీ ఎన్నికైంది. 1930-32 ప్రాంతంలో పురుడు పోసుకున్న ఆంధ్ర రాష్ట్ర కమ్యూనిస్టు ఉద్యమం తొలి దశాబ్దంలోనే రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు విస్తరించింది. ప్రజా సంఘాల నిర్మాణంతో పాటు ప్రజా ఉద్యమాలను నిర్వహించింది. భూస్వామ్య, జమీందారీ వ్యతిరేక పోరాటాలకు భూమికను సృష్టించింది. వందలాది గ్రామాలలో, ముఖ్య పట్టణాలలో ప్రభుత్వ నిర్బంధాలను, నిషేధాలను ఎదుర్కొని రహస్యంగా కమ్యూనిస్టు ఉద్యమం నిర్మించటం ఆనాడు "కత్తిమీద సాము" చేయటం లాంటిది. తొలిదశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో అకుంఠిత దీక్షతో పనిచేసిన నాయకుల, కార్యకర్తల కృషిని సింహావలోకనం చేసుకుని శతాబ్ది ఉత్సవ వేళ ముందుకు సాగటం మన కర్తవ్యం కావాలి.

(ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర గ్రంథం ఆధారంగా, సీపీఐ రాష్ట్ర 28 వ మహాసభల గౌరవార్థం...) సెల్: 9392711999

మన కాలం వీరుడు

చక్రవాకం - ముక్కాముల చక్రధర్

తల్లీ, తండ్రీ రెండు మూడు సంవత్సరాల వ్యవధిలోనే చనిపోతే ఆ బాల్యం ఏమవుతుందో...! మీకు తెలుసా...!. ఏడేళ్ల కుర్రాడికి నాలుగేళ్ల ఓ తమ్ముడ్ని, రెండేళ్ల మరో తమ్ముడ్ని కాన్కగా మిగిల్చి ఆ తలిదండ్రులు మాయమైతే ఈ బాలుడు ఏమవుతాడో ఊహించగలరా...! మచిలీపట్నం పురవీధుల్లో జేబులు కొట్టే గ్యాంగులోనో, పసితనంలోనే బీడీలను కుడేపు నుంచి ఎడమ వైపు, ఎడమ వైపు నుంచి కుడేపునకు తిప్పేసే అలవాట్లు వస్తాయని కదా మన భ్రమ. భోజనం పెట్టాల్సి వస్తుందని బంధువులంతా దూరం పెడితే ఆ ఇద్దరు తమ్ముళ్లకు ఇంత తిండి పెట్టడం కోసం తన గాత్రాన్ని గాంధర్వం చేసుకున్న పిల్లాడ్ని చూశామా...! "బహారో ఫూలూ బర్‌సావో.. మేరా మహబూబ్ అయాహై.. మేరా మహబూబ్ ఆయాహై" అనే పాట మూడు బొజ్జలకి ఉప్మా అయ్యేది. ఆరు ఇడ్లెన్ల ఖరీదు తూర్పు పడమర సినిమాలో పాట "శివరంజనీ... నవ రాగిణీ... వినినంతనేనా తనువులోని అణువణువు" అంత. పండంటి కాపురం సినిమాలో ఘంటశాల పాడితే ఆయనకు అప్పట్లో వందలో, వేలో వచ్చేవి. కానీ అదే పాట "బాబూ... వినరా... అన్నాదమ్ములా కథ ఒకటి" అని ఈ ఏడేళ్ల కుర్రాడు పాడితే ఓ రెండు గ్లాసుల పాలు వచ్చేవి ఇద్దరు తమ్ముళ్లకు.

ఇప్పుడంటే వ్యక్తిత్వ వికాశ పాఠాలు చెబుతున్నాడు ఈ పిల్లాడు చల్లా రామఫణి. వీడు పుట్టక మునుపే వికాశ వ్యక్తిత్వం గురించి తెలుసుకున్నాడు. మెల్లకన్ను అదృష్టమంటారు. అదొక్కటే బాల్యంలో ఈ రామఫణి చేసుకున్నపుణ్యం. యవ్వనంలో పాట ఫణిగాడి రాతను మార్చేసింది. దైవ నిర్ణయమున బ్యాచిలర్‌గా ఉండగా ఇరుకిరుకు సైఫాబాద్ సందుల్లో ఆ గదికి వెళ్లాను ఇతగాడితో కలిసి. గుమ్మం ముందు ఇద్దరు తమ్ముళ్లు గడపకి కళ్లు అతికించుకుని అన్న కోసం ఎదురు చూస్తున్నారు. అప్పటికి యవ్వనులే ఆ ఇద్దరూనూ. మేం వెళ్లగానే ఎన్నో ఏళ్ల తర్వాత చూసిన పేగుబంధంలా ఆ ఇద్దరు తమ్ముళ్లు ఫణిని చుట్టేశారు తల్లి వేరును అల్లుకున్న పిల్ల వేర్లలా. ఇద్దరిని కోడి రెక్కల కింద పిల్లల్ని దాచుకున్నట్లుగా వారిద్దరిని పొదివి పట్టుకున్నాడు. నన్ను పరిచయం చేశాక "ఈ రాత్రి వీడు ఇక్కడే ఉంటాడు" అన్నాడు. " బంగాళా దుంపల వేపుడు , చారు సరిపోతాయి. అన్నం వండాలి అన్నయ్య కోసం" అన్నాడు ఆఖరాడు. నేను "అవసరం లేదు. సరిపోతుంది" అంటే బయటకు వెళ్లి బిస్కట్లు తెచ్చాడు మధ్యస్తుడు. గుమ్మం ముందున్న మెట్ల దగ్గర ఫణీ, నేనూ కూర్చుని కవిత్వం చదువుకుంటూంటే ఆ ఆఖరాడు రామఫణి తొడ మీద తల పెట్టుకుని పడుకున్నాడు. ఆ దృశ్యం నా రెండు కళ్లూ పోయినా నాకు ఇంకా కనపడుతూనే ఉంటుంది ఎప్పటికీ.

బాల్యమంటే మరచిపోలేనిదనుకుంటాం కదా. బాల్యమంటే వెంటాడే జ్ఞాపకం కదా. బాల్యమంటే అల్లుకున్న గుజ్జెన్న గూడు కదా. బాల్యమంటే వృద్ధాప్యానికి ఎరుక కదా. ఇవేవీ లేని బాల్యమే చల్లా రామఫణిది. బాల్యమంటే అతగాడికి పీడకల. బాల్యమంటే అతగాడిని వేధించే ముల్లుకర్ర. బాల్యమంటే అతగాడికి తన చుట్టూ ఆవరించిన చీకటి. పీడకలని, ముల్లుకర్రని, చీకటిని ఛేదించుకుని యవ్వన, వృద్ధాప్యంలోకి పరువులు పెట్టిన ధైర్యం అతగాడి పేరు. ఎవరో ఒకరు ఆలంబన కావాల్సిన జీవితాలు అందరివి. ఈ చల్లా వారి అబ్బాయి రామఫణికి మాత్రం ఆలంబన అన్నమయ్యే. మైకు ముందుకు వచ్చి "పురుషోత్తముడ నీవు... పురుషాధముడ నేను" అని గొంతు సవరించుకోగానే ఆ ఆడిటోరియంలో మన కుడి, ఎడమ సీట్లలో నామాలవాడు ఒకవైపు, అన్నమయ్య ఒకవైపు కూర్చున్నారని మనకి తెలియదు. ఈ రామఫణికి తెలిసింది ఒక్కటే... అదే "బ్రహ్మమొక్కటే.. పరబ్రహ్మమొక్కటే... తందనానా ఆది తంతనాన పురేయ్. తంతనాన భళా తందనానా" అనుకుంటాం ఆ కీర్తనలు విని. కానీ మనకి తెలియది ఒకటుంది అతగాడిలో. అదేమిటో అతను చెప్పడు. మరణానికి చేస్తున్న ఓ ప్రయాణమే జీవితమనుకుంటాం కదా...! కానీ ఈ ఫణిగాడు మాత్రం జీవితానికి కొత్త అర్థాలు చెబుతాడు. వ్యక్తి వికసించాలని లోలోపల తపన పడుతూంటాడు.

ఆ క్లాసుల్లో తనని తాను శిక్షించుకుని, ఆత్మహత్యించుకుని, ఆవేదించి, అలిగి, అలసి, సొలసి, విసిగి, వేసారి "మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలుగా మార్చేస్తున్నానేమో" అని కళ్ల వెంట ధారాపాతంగా వస్తున్న వెక్కిళ్ల వేదనని రెండు అరచేతులతో కప్పుకోవడం మనకెవ్వరికి కనిపించదు కాక కనిపించదు. వాడే కవిత్వమైనట్లు అతగాడి జీవితం "త్రిశంకు నరకం". మూడున్నర దశాబ్దాల క్రితం ఆ కూకట్‌పల్లి కాలనీలోని సున్నా నరేష్, పసునూరి శ్రీధర్ బాబు, సిద్ధార్థల సాక్షిగా రామఫణి రాసిన కవితను విన్నాక "ఇది కవిత్వం కాదురా" అంటూ నా పొగరుబోతుతనం ఆ కాగితాలను చింపేస్తే "ఇందుకే నీకు వినిపించానురా. ఇది కవిత్వమని భ్రమించా. నువ్వు చింపేశావు. ఆ భ్రమలు పటాపంచలయ్యాయి" అన్నాడు వినమ్రంగా. ఆనాటి ఆ నా దుందుడుకు చర్యకు వాడికి మనసులోనే ఎన్ని వేలసార్లు క్షమాపణలు కోరుకున్నా ఆ బాధ పోవడంలేదు.

అగ్నితో ఆనాటి ఆ నా చేతుల్ని ప్రక్షాణన చేసుకున్నా ఆ పాపం పోదని నాకు తెలుసు. కవిత్వంపై నా ప్రేమ కఠినమైనదని వాడికి ఎన్నిసార్లు కలలో కనిపించి చెప్పానో వాడు నే కలిసినప్పుడల్లా నన్ను కౌగలించుకున్న ప్రతీసారీ తెలిసేది. చలం అన్నట్లు ఎవరిని దొంగిలించామో వారిని క్షమించడం కష్టం. ఆ రామఫణి ముందు నా పరిస్థితి చలం చెప్పినట్లుగానే ఉంటుంది. అతగాడ్ని కలిసినప్పుడల్లా మనం బతుకుతున్నాం అనిపిస్తుంది. వాడు జీవిస్తున్నాడు అనిపిస్తుంది. బతుక్కి జీవికకు మధ్య ఉన్న తేడా ఒక్కటే. అదే చల్లా రామఫణి.

సీనియర్ జర్నలిస్ట్, 99120 19929

కదులుదాం రండి ఒంగోలుకు...

అవిగో వినపడుతున్నాయి
సమర శీల ఉద్యమ తరంగాల ధ్వనులు
భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల వీర చరిత్ర ధ్వనులు వినపడుతున్నాయి
ఒంగోలు నగరంలో సీపీఐ రాష్ట్ర 28వ మహాసభల ప్రతిధ్వనులు వినబడుతున్నాయి
భూమి కోసం భుక్తి కోసం శ్రామిక జన విముక్తి కోసం
ఆద్యంతం పోరాడిన ఎర్రజెండా రెపరెపలు వినబడుతున్నాయి
ప్రతి పేదవాడికి కూడు,గూడు,గుడ్డ కావాలని పోరాడిన పోరాటాల శబ్దాలు వినబడుతున్నాయి
తెల్లదొరల పాలనలో కమ్యూనిస్టులు ఎదుర్కొన్న నిషేధాలు,నిర్బంధాలు,
కుట్రకేసులు, రక్తతర్పణలు, బలిదానాలు కళ్లముందే మెదులుతున్నాయి
కేరళ పున్నప్ర-వయలార్ పోరాటాలు బెంగాల్ తెబాగా ఉద్యమాలు
తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాలు 4000 మంది అమరవీరుల బలిదానాలు
కళ్లముందు కదులుతూనే ఉన్నాయి.
భారతదేశ స్వాతంత్ర సమపార్జన సమరంలో కమ్యూనిస్టు పార్టీ సమర నినాదాలు
సంపూర్ణ స్వాతంత్ర్య కాంక్ష జ్వాలా కిరణాలు వెదజల్లిన వెలుతురులు ఇప్పటికీ కనబడుతూనే ఉన్నాయి
దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, సెక్యులర్ భావాల విస్తరణకు,
సోషలిస్టు రాజస్థాపనకు,రాజ్యాంగ పరిరక్షణకు,నడుపుతున్న పోరాటాలు
నిలువెత్తు సాక్షాలుగాను మన ముందు నిలుస్తున్నాయి.
దేశంలో స్వేచ్ఛ,సమానత్వం,సౌభాతృత్వం ఉండాలని
కులోన్మత్త మతోన్మాద వినాశనకర విధానాల నశింపుకు నిరంతర
పోరాట ఘీంకారాలు వినపడుతూనే ఉన్నాయి
మనిషికి మాట్లాడే హక్కు,జీవించే హక్కు, విద్య హక్కు,ఆరోగ్య హక్కు, పత్రికల్లో ప్రకటన హక్కు,
స్వేచ్ఛ హక్కుల కోసం ఉద్యమిస్తున్న ఉద్యమ ధ్వనులు వినపడుతున్నాయి
దళిత మైనార్టీ మహిళ వివక్షతలపై ఎగిసిపడుతున్న ఉద్యమ జ్వాలలు కనపడుతున్నాయి
శ్రామిక జన హక్కులకు కుత్తుకపై వేలాడుతున్న కత్తులు కనబడుతున్నాయి
రైతన్న హక్కులు కలరాస్తూ కార్పొరేట్ వర్గాల కాళ్లకు దాసోహం అంటున్నా
పాలకుల దుష్టపన్నాగాలు కనపడుతున్నాయి
ఈ అన్ని పోరాటాలకు ఉత్తేజాన్ని ఇస్తున్నది ఎర్రజెండా
ఈ ఎర్రజెండ సంబరాలు అంబరాన్ని తాగుతున్నట్లు ఒంగోలు నగరంలో
సీపీఐ రాష్ట్ర 28వమహాసభలు అంగరంగ వైభవంగా సాగుచున్న మహా సభ
కమ్యూనిస్టు శ్రేణులకు ఉత్సాహాన్ని ఉల్లాసాన్ని ఇస్తున్నది
పదండి ఒంగోలు నగరానికి భుజం భుజం కలిపి జనం మనం కలిసి
కదిలి రండి కదులుదాము రండి కదిలించుదాము రండి.

ఎస్.వెంకటసుబ్బయ్య, సెల్ : 9949207506

ఆర్‌ఎస్‌ఎస్ ఉత్సవాలకు కోవింద్



న్యూఢిల్లీ : రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) స్థాపించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా అక్టోబరు 2న నాగ్‌పూర్‌లోని ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయంలో జరిగే కార్యక్రమానికి మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. 'రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) వ్యవస్థాపక శతాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహించే విజయదశమి ఉత్సవం అక్టోబరు 2, 2025న ఉదయం 7:40 గంటలకు నాగ్‌పూర్‌లోని రేషింబాగ్‌లో జరుగుతుంది' అని ఒక ప్రకటనలో పేర్కొంది. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఈ కార్యక్రమంలో ప్రసంగిస్తారని తెలిపింది. ప్రజలకు భారీ చేరువలో భాగంగా దేశ వ్యాప్తంగా ఇంటింటికి తిరిగి కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆర్ఎస్ఎస్ నిర్ణయించింది.

చెన్నైను ముంచెత్తిన వర్షం

చెన్నై: తమిళనాడు రాజధాని చెన్నైను శుక్రవారం భారీ వర్షం ముంచెత్తింది. ఉరుములు, మెరుపులతో కూడిన కుండపోత వర్షంతో రోడ్లన్నీ పూర్తిగా జలమయమయ్యాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు, కడలూరు జిల్లాలకు చెన్నై ప్రాంతీయ వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసింది. నుంగంబాక్కం, అడయార్, రాజా అన్నామలైపురం, వడపళని సహా అనేక ప్రాంతాల్లో ఉదయం ఐదు గంటల నుంచి సుమారు ఐదు సెంటీమీటర్ల వర్షం కురిసింది. శనివారం తమిళనాడు, పుదుచ్చేరి, కారైకల్‌లో వివిధ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

పాఠశాలలకు ఆగని బెదిరింపులు

న్యూఢిల్లీ: ఢిల్లీలోని పాఠశాలలకు వరుసగా ఐదోరోజు బాంబు బెదిరింపు ఈ-మెయిల్స్ వచ్చాయి. శుక్రవారం ద్వారకా సెక్టార్-7లోని ఒక పాఠశాలకు ఈమెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. ఢిల్లీ అగ్నిమాపక కార్యాలయానికి ఉదయం ఏడు గంటలకు సమాచారం అందగా... పోలీసులు, ఫైర్ బృందాలు సంఘటనా స్థలంలో తనిఖీలు నిర్వహించాయి. ఇప్పటివరకు 50కిపైగా పాఠశాలలకు ఈమెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. దాంతో పోలీసులతో పాటు ఇతర అత్యవసర సేవలన్నీ పాఠశాలల్లో తనిఖీలు చేపట్టగా...అనుమానాస్పద వస్తువులు మాత్రం కనిపించలేదు. బెదిరింపులు వచ్చిన పాఠశాలల జాబితాలో రాహుల్ మోడల్ స్కూల్, మాక్స్‌ఫోర్ట్ స్కూల్, మాలవీయనగర్‌లోని ఎస్‌కేవీ, ప్రసాద్ నగర్‌లోని ఆంధ్రా స్కూల్స్ ఉన్నాయి. వరుస బెదిరింపులతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలకు పంపిన బెదిరింపు సందేశాల గురించి తెలుసుకోవడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

డీకే శివకుమార్ ఆర్‌ఎస్‌ఎస్ పాట

బెంగళూరు: కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అసెంబ్లీలో ఆర్ఎస్ఎస్ గీతాన్ని ఆలపించడం ఆసక్తికరంగా మారింది. డీకే చర్యతో బీజేపీ ఎమ్మెల్యేలు ఆశ్చర్యంతో హర్షధ్వానాలు వ్యక్తం చేశారు. చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాట ఘటనపై చర్చ సందర్భంగా ఈ పరిణామం చోటు చేసుకుంది. ప్రతిపక్ష నాయకుడు ఆర్.అశోక్... శివకుమార్‌కు ఆర్ఎస్ఎస్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేశారు. దీనికి ప్రతిస్పందనగా డీకే ఆర్ఎస్ఎస్ గీతం 'నమస్తే సదా వత్సలే' ఆలపించారు. డీకే ఆర్ఎస్ఎస్ గీతాన్ని ఆలపించడంతో అక్కడున్న బీజేపీ ఎమ్మెల్యేలంతా ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు. గట్టిగా బల్లలు చరిచారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. సీఎం కుర్చీ ఇవ్వకుంటే తాను బీజేపీలో చేరుతానని కాంగ్రెస్‌కు డీకే హెచ్చరిక పంపారని నెటిజన్లు వ్యాఖ్యానాలు చేస్తున్నారు. మరోవైపు డీకే ఆర్ఎస్ఎస్ పాటను ఆలపించడంతో అసెంబ్లీలో గందరగోళం, వాగ్వాదం నెలకొంది. కర్నాటక కాంగ్రెస్‌లో అధికార మార్పిడి వ్యవహారం కొనసాగుతోన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఉన్న సిద్ధరామయ్య స్థానంలో డీకే శివకుమార్‌ను సీఎంగా చూడాలని మెజారిటీ ఎమ్మెల్యేలు కోరుకుంటున్న తరుణంలో తాజాగా కీలక పరిణామం చోటు చేసుకుంది.

ఈసీపై ప్రతిపక్షాల ఐక్యపోరు: పవార్

ముంబై: ఎన్నికల సంఘం (ఈసీ)పై ప్రతిపక్షాలు ఐక్యంగా పోరాడుతున్నట్లు ఎన్‌సీపీ (ఎస్‌పీ) అధ్యక్షుడు శరద్ పవార్ తెలిపారు. ఎన్నికల మోసాలను ప్రజల్లోకి తీసుకెళతామని చెప్పారు. గతంలో జరిగిన ఎన్నికల ఫలితాలను తమ పార్టీ కూడా అధ్యయనం చేస్తుందన్నారు. వాస్తవ సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పవార్ నొక్కిచెప్పారు. ఓట్ల చోరీపై ప్రతిపక్షం ఐక్యంగా ఉందని ప్రకటించారు. ఒకరికి ఒకటే ఓటు సిద్ధాంతాన్ని అనుసరించడంలో ఎన్నికల సంఘం విఫలమైందని విమర్శించారు. కర్నాటకలోని మహదేవపుర నియోజకవర్గంలో ఐదు రకాలుగా ఓట్లు దోచుకున్నారన్న కాంగ్రెస్ ప్రచారంపై ప్రశ్నకు 'మేము కూడా ఎన్నికల ఫలితాలను అధ్యయనం చేస్తున్నాం. ఓట్ల చోరీపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం. ఆ దిశగా ముందుకెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం అందుకు రెండు వారాలు పడుతుంది' అని పవార్ అన్నారు. ఈసీ నుంచి ఏమీ ఆశించడం లేదన్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నుంచి అఫిడవిట్‌ను ఎన్నికల సంఘం కోరడాన్ని తప్పుపట్టిన పవార్... రాహుల్ తిరస్కృతిని సమర్థించారు.

ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా 300 మంది ఎంపీలు వీధుల్లోకి వస్తే... అరెస్టు చేశారని వ్యాఖ్యానించారు. బీహార్‌లో రాహుల్ సభలకు అమితాదరణ లభిస్తోందని పవార్ వెల్లడించారు. 'అక్టోబరు లేక నవంబరులో బీహార్ అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతాయి. బీహార్ ఆర్థికంగా వెనుకబడిన రాష్ట్రమే కావచ్చుకానీ అక్కడి ప్రజల రాజకీయ అవగాహన ఉంది. మహాత్మాగాంధీ చంపారన్ నుంచి సత్యాగ్రహం మొదలు పెట్టారు. బీహార్ నుంచే ఎమర్జెన్సీ వ్యతిరేక పోరు జేపీ నారాయణ్ నాయకత్వంలో జరిగింది. కేంద్ర మాజీ మంత్రి కపూరీ ఠాకూర్ వంటి అనేక మంది ప్రజా నాయకులను ఈ రాష్ట్రం అందించింది' అని శరద్ పవార్ అన్నారు.

'ఇండియా' వైపే పవార్: ఫడ్నవీస్

ఎన్‌డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ అభ్యర్థిత్వానికి మద్దతు ఇవ్వాల్సిందిగా విపక్ష నేతలను బీజేపీ కోరుతోంది. ఇందులో భాగంగా నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (శరద్‌చంద్ర పవార్) అధినేత శరద్ పవార్, శివసేన (ఉద్ధవ్) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రేలను మద్దతు కోరుతూ మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ సంప్రదించారు. దీనిపై శుక్రవారం మీడియాతో ఫడ్నవిస్ మాట్లాడుతూ మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు మద్దతు ఇవ్వాల్సిందిగా పవార్‌ను కోరానని, అయితే విపక్ష కూటమి అభ్యర్థి వెంటే తాము వెళతామని ఆయన చెప్పారని తెలియజేశారు. ఉద్ధవ్ ఠాక్రే మాత్రం దీనిపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని అన్నారని వివరించారు. దీనికి ముందు శివసేన నేత సంజయ్ రౌత్ మాట్లాడుతూ దేవేంద్ర ఫడ్నవిస్‌తో పాటు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సైతం ఠాక్రేను సంప్రదించారని, ఎన్‌డీఏ అభ్యర్థికి మద్దతు ఇవ్వాల్సిందిగా కోరారని తెలిపారు. మహారాష్ట్రలోని విపక్ష మహాకూటమిలో కాంగ్రెస్‌తో ఎన్‌సీపీ (ఎస్‌పీ), శివసేన (యూబీటీ) భాగస్వాములుగా ఉన్నాయి. జాతీయస్థాయిలో 'ఇండియా' ఐక్యసంఘటనలో మూడు పార్టీలు భాగస్వాములుగా ఉన్నాయి. శివసేన (యూబీటీ)కు లోక్‌సభలో 9 మంది, ఎన్‌సీపీ (ఎస్‌పీ)కి 10 మంది ఎంపీలు ఉండగా, రెండు పార్టీలకు రాజ్యసభలో చెరో ఇద్దరు ఎంపీలు ఉన్నారు. కేంద్రంలోని అధికార ఎన్‌డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్‌ను ఎంపిక చేయగా... సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి బి.సుదర్శన్ రెడ్డిని విపక్ష కూటమి ఎంపిక చేసింది. సెప్టెంబర్ 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక జరగనుంది. ఎలక్టోరల్ కాలేజీలో 781 మంది ఉండగా... మెజారిటీ మార్క్ 391గా ఉంది.

విజయ్ దిగజారుడు రాజకీయం

టీవీకే అధినేతపై మండిపడ్డ పార్టీలు

చెన్నై: టీవీకే అధినేత... నటుడు విజయ్‌పై రాజకీయ పార్టీలు మండిపడ్డాయి. గురువారం మధురైలో జరిగిన టీవీకే సమావేశంలో తమ నాయకులను లక్ష్యంగా చేసుకుని ఆయన విమర్శలు చేయడంపై అధికార డీఎంకే వర్గంతో పాటు ప్రతిపక్ష అన్నాడీఎంకే, బీజేపీ కూడా విజయ్‌పై ధ్వజమెత్తాయి. తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్‌ను 'మామ' అని సంబోధించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ, రాష్ట్ర మునిసిపల్ పరిపాలన మంత్రి కె.ఎన్.నెహ్రూ నటుడు విజయ్ దిగజారుడు రాజకీయాన్ని ప్రదర్శించారని మండిపడ్డారు. 'నాలుగు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్న, ప్రస్తుత ముఖ్యమంత్రి అయిన ఒక గొప్ప రాజకీయ నాయకుడిని 'మామ' అని సంబోధించడంలో సరికాదని, ప్రజల మద్దతు ఉన్న డీఎంకే 2026 అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్‌కు తగిన సమాధానం ఇస్తుంది' అని నెహ్రూ విలేకరులతో అన్నారు. ఇక మాజీ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ విలేకరులతో మాట్లాడుతూ 'బీజేపీని ఫాసిజంతో ముడిపెట్టి విజయ్ మాట్లాడుతున్నారు. బహుశా, పార్టీ సమావేశంలో నటుడు అందిస్తున్న స్క్రిప్ట్‌ను వేరొకరు రాసి ఉండవచ్చు' అని అన్నారు. 'ఇది కేవలం ఒక రోజు సినిమా షో' అని టీవీకే రెండవ సమావేశంలో విజయ్ ప్రసంగాన్ని విమర్శిస్తూ తమిళిసై అన్నారు. విజయ్ అన్ని రాజకీయ పార్టీలను విమర్శిస్తూ, 'మిస్టర్ ప్రైమ్ మినిస్టర్, మత్స్యకారుల సమస్యపై మీ కోసం నా నుంచి ప్రశ్నలు ఉన్నాయి' అని అన్నారు. కచ్చతీవు ద్వీపాన్ని శ్రీలంక నుంచి తిరిగి పొందేందుకు చర్యలు తీసుకోవాలని, తమిళనాడును నీట్ నుంచి మినహాయించాలని ఆయన ప్రధాన మంత్రిని కోరారు. కాగా, బీజేపీ నాయకుడు ఆర్.శరత్ కుమార్ మాట్లాడుతూ నటులు సహా ఎవరైనా రాజకీయాల్లో చేరడానికి స్వాగతం పలుకుతున్నప్పటికీ, విజయ్ ఏం మాట్లాడుతున్నాడో అతనికి తెలియదని అన్నారు. 'ఫాసిజం అంటే ఏమిటో ఆయనకు తెలుసో లేదో నాకు ఆశ్చర్యంగా ఉంది. ఆయన రాజకీయ అనుభవం లేని వ్యక్తి. ఏమి మాట్లాడాలో, పార్టీ సిద్ధాంతాన్ని ఎలా ముందుకు తీసుకెళ్లాలో ఆయనకు తెలియదు. ఆయనకు మిస్టర్ ప్రైమ్ మినిస్టర్ అని అనే హక్కు లేదు' అని శరత్ కుమార్ టుటికోరిన్‌లో విలేకరులతో అన్నారు. ఏఐఏడీఎంకే ప్రతినిధి వైగై సెల్వన్ మాట్లాడుతూ 2026 అసెంబ్లీ ఎన్నికల తర్వాత విజయ్, అతని టీవీకే అదృశ్యమవుతారని అన్నారు. అన్నాడీఎంకే ఎవరి చేతుల్లో ఉందని ఆ నటుడు అడగడం చాలా వింతగా ఉందని అన్నాడీఎంకే రాష్ట్ర మాజీ మంత్రి ఆర్.బి.ఉదయకుమార్ వ్యాఖ్యానించారు. 'ఈ సందేహం ఎందుకు? మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి కె పళనిస్వామి అన్నాడీఎంకే నియంత్రణలో ఉన్నారని, కేంద్ర హోం మంత్రి అమిత్ షా 2026 ఎన్నికలకు పళనిస్వామిని ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించారని ఆయనకు తెలియదా?' అని ఉదయ్ కుమార్ ప్రశ్నించారు.

దశాబ్దంలో 20 తొక్కిసలాటలు

బీజేపీ పాలిత రాష్ట్రాలపై సిద్ధరామయ్య విమర్శలు

బెంగళూరు: బీజేపీ పాలిత రాష్ట్రాల్లో తొక్కిసలాటు తరచూ జరుగుతాయని, గత పదేళ్లలో కనీసం 20 ఘటనలు చోటుచేసుకున్నాయని కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వ్యాఖ్యానించారు. వీటి గురించి ఎందుకు మాట్లాడరని ప్రతిపక్ష బీజేపీని ప్రశ్నించారు. ఆర్సీబీ విజయోత్సవాల్లో భాగంగా బెంగళూరు స్టేడియంలో తొక్కిసలాట జరగడంపై విమర్శలను కొట్టిపారేశారు. ఇదే అంశంపై శుక్రవారం అసెంబ్లీలో సీఎం మాట్లాడారు. '2008 హిమాచల్ ప్రదేశ్‌లోని నైనాదేవి ఆలయంలో తొక్కిసలాట జరిగింది. అదే ఏడాది జోధ్‌పూర్‌లో తొక్కిసలాట చోటుచేసుకుంది. 2021లో హరిద్వార్‌లో, 2013 రతన్‌గఢ్‌లో, మధ్యప్రదేశ్‌లో, 2024 హత్రాస్‌లో ఘటనలు జరిగాయి. వందల సంఖ్యలో మరణాలు సంభవించాయి. ఈ ఏడాది జనవరిలో ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహించిన కుంభమేళాలో జరిగిన తొక్కిసలాటలో 39 మంది ప్రాణాలు కోల్పోయారు. యూపీ ప్రభుత్వం మృతుల వివరాలు వెంటనే వెల్లడించలేదన్నారు' అని సిద్ధరామయ్య అన్నారు. ఐపీఎల్‌లో విజయం సాధించడాన్ని గర్వంగా భావించి ఆర్సీబీ సంబరాలకు అభిమానులు తరలి రావడంతో చిన్నస్వామి స్టేడియంలో దుర్ఘటన జరిగింది. 11 మంది మృతి చెందగా, 50 మందికి పైగా గాయపడ్డారు. కర్నాటక ప్రభుత్వం జ్యుడీషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేసి ప్రత్యక్ష సాక్షులు, క్రికెట్ సంఘం అధికారులు, పోలీస్ అధికారుల వాంగ్మూలాలు సేకరించింది. ఆర్సీబీ కార్యక్రమంలో భద్రతా వైఫల్యం కనిపించిందని గుర్తించింది. స్టేడియం లోపల 79 మంది పోలీసులు మాత్రమే ఉండటం, అంబులెన్స్‌లు ఉండకపోవడం కమిషన్ గమనించింది. పోలీసు వైఫల్యం ఉందని నివేదికలో వెల్లడించింది. ఆర్సీబీ, కర్నాటక క్రికెట్ బోర్డు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థపై ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. కర్నాటక హైకోర్టు కూడా ఈ కేసును విచారిస్తోంది.

బిగ్‌బాస్ విజేత ఇంటిపై కాల్పుల నిందితుడి అరెస్ట్

చండీగఢ్: యూట్యూబర్... హిందీలో ప్రసారమైన బిగ్‌బాస్ ఓటీటీ సీజన్-2 విజేత ఎల్విష్ యాదవ్ ఇంటిపై కాల్పులు జరిపిన నిందితుడిని శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. గతవారం ఇద్దరు దుండగులు కాల్పులు జరపడంతో సుమారు 24 బుల్లెట్లు యూట్యూబర్ ఇంట్లోకి దూసుకెళ్లాయి. అయితే ఆ సమయంలో ఎల్విష్ ఇంట్లో లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఆ కాల్పులు జరిపిన ఇద్దరిలో ఒకరిని పోలీసులు అరెస్టు చేశారు. అతడిని ఇషాంత్ అలియాస్ ఇషు గాంధీగా గుర్తించారు. ఫరీదాబాద్‌లోని జవహర్‌నగర్ కాలనీకి చెందిన వాడని పేర్కొన్నారు. నిందితుడిని పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో అతడికి సంబంధించిన సమాచారం అందడంతో నిఘాపెట్టారు. శుక్రవారం ఉదయం నీరజ్ ఫరీద్ పురియా ముఠాను కలిసేందుకు ఇషాంత్ వెళ్తుండగా పోలీసులు వెంబడించారు. దీంతో అతడు పోలీసులపై ఆటోమేటిక్ పిస్టల్‌తో ఆరు రౌండ్ల కాల్పులు జరిపాడు. ప్రతిగా పోలీసులు అతడి కాలిపై గన్‌తో కాల్చడంతో గాయపడ్డాడు. అనంతరం అతడిని అరెస్టు చేసి ఆసుపత్రికి తరలించారు.

వీధుల్లో కుక్కలకు ఆహారం పెట్టొద్దు: సుప్రీం

న్యూఢిల్లీ: వీధి కుక్కలకు బహిరంగ ప్రదేశాల్లో కాకుండా నిర్దేశిత ప్రాంతాల్లోనే ఆహారం పెట్టాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీచేసింది. వీధి కుక్కలకు ఆహారం అందజేసేందుకు ప్రతి వార్డులో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయాలని, నిర్దేశిత ప్రాంతాల్లో ఈ మేరకు నోటీసు బోర్డులు పెట్టాలని, ఎట్టిపరిస్థితుల్లో వీధుల్లో కుక్కలకు ఆహారం ఇవ్వకూడదని, ఈ ఆదేశాలను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలుంటాయని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది.

నియంత్రణ లేకుండా ఆహారం ఇవ్వడం వల్ల అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుంటున్నాయన్న నివేదికలను పరిగణనలోకి తీసుకొని తాజా ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించింది. ఢిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతం నుంచి వీధి కుక్కలన్నింటినీ తరలించాలంటూ ఈనెల 11న ఇచ్చిన ఆదేశాలకు భిన్నంగా ప్రస్తుత ఉత్తర్వులు ఉన్నాయి. వీధి కుక్కల దాడులు పెరిగిపోవడంపై ఆందోళన వ్యక్తం చేసిన ద్విసభ్య ధర్మాసనం... ఢిల్లీలో మళ్లీ కుక్కలు కనిపించడానికి వీల్లేదని, వీటిని షెల్టర్లకు తరలించాలని పేర్కొంది. ఈ ఆదేశాలపై తీవ్ర అభ్యంతరాలు, నిరసనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్‌వీ అంజరియాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారించింది. రేబిస్ లక్షణాలు లేదా విపరీత ప్రవర్తన కలిగిన కుక్కలు మినహా ఇప్పటివరకు షెల్టర్లకు తరలించిన వాటి విడుదలకు ఆదేశించింది. వాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేసిన తర్వాత ఎక్కడ నుంచి తెచ్చారో అక్కడే విడిలేయండి అని కోర్టు పేర్కొంది. తదుపరి విచారణను ఎనిమిది వారాలకు వాయిదా వేసింది.

ఈసీఐ తీరు బహిర్గతం

ఎస్ఐఆర్‌పై సుప్రీం తీర్పును స్వాగతించిన కాంగ్రెస్

న్యూఢిల్లీ : బీహార్‌లో ఎస్ఐఆర్ అంశంపై సుప్రీం కోర్టు ఆదేశాన్ని స్వాగతించిన కాంగ్రెస్ శుక్రవారం, భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) చేసిన 'క్రూరమైన దాడి' నుంచి ప్రజాస్వామ్యం బయటపడిందని, ఎన్నికల సంస్థ 'పూర్తిగా బహిర్గతమైందని, అపఖ్యాతి పాలైందని' పేర్కొంది. ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీలను చేర్చడం ద్వారా సవరణను మరింత కలుపుకునేందుకు సుప్రీం కోర్టు రక్షణ కవాటాలను ఏర్పాటు చేసిందని, ఇప్పటివరకు ఈసీఐ విధానం 'అడ్డంకి కలిగించేది... ఓటర్ల ప్రయోజనాలకు విరుద్ధంగా' ఉందని ప్రతిపక్ష పార్టీ ఆరోపించింది. ఎన్నికలు జరగనున్న బీహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కసరత్తులో భౌతిక సమర్పణలు చేయడంతో పాటు మినహాయించబడిన ఓటర్లు ఆన్ లైన్ పద్ధతి ద్వారా క్లెయిమ్‌లను సమర్పించడానికి అనుమతించాలని సుప్రీం కోర్టు ఎన్నికల సంఘాన్ని ఆదేశించిన తర్వాత కాంగ్రెస్ ఈ వ్యాఖ్యలు చేసింది. న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చితో కూడిన ధర్మాసనం ఆధార్ కార్డ్ నంబర్, ఎస్ఐఆర్‌లో 11 ఆమోదయోగ్యమైన పత్రాలలో ఏదైనా ఒకదానితో పాటు క్లెయిమ్ ఫారమ్‌లను సమర్పించడానికి అనుమతించింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్ వ్యవహారాల ఇంఛార్జ్ జైరాం రమేశ్ మాట్లాడుతూ బీహార్‌లో ఎస్ఐఆర్ అంశంపై సుప్రీం కోర్టు ఆదేశాలను పార్టీ స్వాగతిస్తున్నట్లు తెలిపారు. 'భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) చేసిన 'క్రూరమైన దాడి నుంచి ప్రజాస్వామ్యం బయటపడింది' అని అన్నారు. ఆగస్టు 14న తొలగించబడిన ఓటర్ల జాబితాను నిలిపివేయాలనే ఈసీఐ నిర్ణయాన్ని సుప్రీం కోర్టు పక్కన పెట్టిందని ఆయన 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు.

తమ్ముడూ... ఆ ద్రోహులతో జాగ్రత్త

పట్నా: తమ్ముడూ ఆ ద్రోహులతో జాగ్రత్త అంటూ రాష్ట్రీయ జనతాదళ్ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ పెద్ద కుమారుడు, మాజీ మంత్రి తేజ్ ప్రతాప్ యాదవ్ తన తమ్ముడు తేజస్వీ యాదవ్‌కు సలహా ఇచ్చారు. తేజ్ ప్రతాప్‌కు సంబంధించి ఇటీవల ఫేస్‌బుక్‌లో ఒక పోస్టు ప్రత్యక్షమైంది.ఆయన ఒక మహిళతో ఉన్న ఫొటో దానిలో ఉంది. ఆమె పేరు అనుష్క యాదవ్ అని, 12 ఏళ్లుగా తాము రిలేషన్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు. ఇది కాస్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో తేజ్ ప్రతాప్ తన కుటుంబ గౌరవాన్ని మంట గలుపుతున్నారని లాలూ ప్రసాద్ యాదవ్ అతడిని పార్టీ నుంచి ఆరేళ్ల పాటు బహిష్కరించారు. తండ్రి తీసుకున్న నిర్ణయంపై తేజ ప్రతాప్ స్పందిస్తూ... తనపై రాజకీయంగా, వ్యక్తిగతంగా కుట్ర జరుగుతోందని ఆరోపించారు. సమాజంలో పేరు ప్రతిష్టలున్న ఐదు కుటుంబాలు ఈ కుట్రకు పాల్పడుతున్నాయి. త్వరలో వారి వివరాలు బహిర్గతం చేస్తానని తేజ్ ప్రతాప్ ప్రకటించారు. 'నేను ఏ తప్పూ చేయలేదు. ఎవరిమీద ఎలాంటి కుట్రలకు పాల్పడలేదు. కానీ, ఈ ఐదు కుటుంబాలు వ్యక్తిగత, రాజకీయ జీవితాన్ని నాశనం చేశాయి' అని ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ఈ ఏడాది చివరిలో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల కోసం టీమ్ తేజ్‌ప్రతాప్‌యాదవ్ పేరుతో తన ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు. అదే సమయంలో తనపై రాజకీయ కుట్ర చేస్తున్న వారిని ద్రోహులుగా పేర్కొంటూ వారిని టార్గెట్ చేస్తున్నారు. కాగా, తేజ్ ప్రతాప్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు బీహార్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఆ ఐదు కుటుంబాలు ఏవో... ఆయన ఎలాంటి ఆధారాలు చూపించబోతున్నారో అన్నది ఆసక్తిగా మారింది.

పార్లమెంట్ వద్ద చొరబాటు: వ్యక్తి అరెస్టు

న్యూఢిల్లీ: పార్లమెంట్ వద్ద భద్రతాపరమైన ఉల్లంఘన జరిగింది. ఓ వ్యక్తి అక్కడి చెట్టు ఎక్కి, గోడ దూకి పార్లమెంటు ప్రాంగణంలోకి చొరబడ్డాడు. రైలు భవన్ వైపు నుంచి పార్లమెంటు కొత్త భవనం గరుడ ద్వారం వద్దకు చేరుకున్నాడు. శుక్రవారం ఉదయం 6.30 గంటలకు ఈ ఘటన చోటుచేసుకుంది. చొరబాటుకు యత్నించిన వ్యక్తిని అక్కడి భద్రతా సిబ్బంది గుర్తించి, వెంటనే అదుపులోకి తీసుకొని విచారించారు. పార్లమెంటు సమావేశాలు ముగిసిన మరుసటి రోజే ఇలాంటి ఘటన జరగడం గమనార్హం. 2023 డిసెంబరు 13న పార్లమెంట్‌పై ఉగ్రదాడికి 22 ఏళ్లు అయిన తరుణంలో లోక్‌సభలోకి ఇద్దరు దూసుకొచ్చిన ఘటన చోటుచేసుకోవడం అప్పట్లో కలకలం రేపింది. పబ్లిక్ గ్యాలరీ వద్ద కూర్చొన్న యువకులు సభలోకి దూకి, రంగుల పొగను వదిలి గందరగోళం సృష్టించారు. పార్లమెంట్ వెలుపల కూడా మరో ఇద్దరు ఇదే తరహా నిరసన చేపట్టారు.

దీంతో పార్లమెంట్ భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. గతేడాది ఆగస్టులోనూ ఉల్లంఘన జరిగింది. ఓ యువకుడు గోడ దూకి లోపలికి చొరబడేందుకు యత్నించాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన మనీశ్‌గా పోలీసులు అతనిని గుర్తించారు. అతడి మానసిక స్థితి సరిగా లేదని అప్పట్లో పోలీసులు వెల్లడించారు. తాజా చొరబాటుదారుడు కూడా ఉత్తరప్రదేశ్‌కు చెందిన రామ (20)గా గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. మానసిక పరిస్థితి సరిగాలేదని తొలుత భావిస్తున్నారు కానీ ఈ పని ఎందుకు చేసివుంటాడని ఆరా తీసేందుకు ఐబీ, ఢిల్లీ పోలీసుల ప్రత్యేక విభాగం రంగంలోకి దిగింది. నిందితుడిని ప్రశ్నించింది.

బెంగాల్ ఖైదీలపై ఏఐ నిఘా

కోల్‌కతా: నేరగాళ్లపై నిఘా కోసం కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత కెమెరాలు ఏర్పాటు చేసేందుకు బెంగాల్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. ఇటీవల బెంగాల్‌లోని పరివర్తన కేంద్రాల్లో శిక్ష అనుభవిస్తున్న కరడుగట్టిన నేరగాళ్లు బయట జరిగే నేరాలకు జైళ్ల నుంచి వ్యూహాలు రచించడం, గంజాయి అక్రమ రవాణా, బెదిరింపులు, హత్యలు వంటి నేరాలకు ప్రణాళికలు చేస్తుండటంతో జైలు కేంద్రాలు నేరాలకు నిలయాలుగా మారాయన్నారు.

చట్టవిరుద్ధ కార్యకలాపాలను అడ్డుకునేందుకు ఏఐ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారి తెలిపారు. బెంగాల్ వ్యాప్తంగా 60 పరివర్తన కేంద్రాల్లో అత్యాధునిక కెమెరాలు ఉన్నప్పటికీ ఖైదీలు తమ దృష్టి నుంచి తప్పించుకుంటున్నారని, అందువల్లే ఏఐతో కెమెరాలు అనుసంధానిస్తున్నామని అన్నారు. ప్రతి ఖైదీ బయోమెట్రిక్ వివరాలను ఇందులో పొందుపరుస్తామన్నారు. ఇవి సాధారణ కెమెరాల్లా రికార్డు అవడమే కాక జైలు లోపల అనుమానాస్పద కదలికలు, తగాదాలు, విధ్వంసం, తప్పించుకునే ప్రయత్నాలు వంటివాటిని గుర్తించి వెంటనే జైలు గార్డులను అప్రమత్తం చేస్తాయని తెలిపారు. ముఖగుర్తింపు ద్వారా భోజన సమయాల్లో, హాజరు తీసుకునే సమయంలో గైర్హాజరైన వారిని, పారిపోవడానికి ప్రయత్నించిన వారిని ట్రాక్ చేసి అధికారులను అప్రమత్తం చేస్తుందన్నారు. కరడుగట్టిన నేరగాళ్లు ప్రత్యేక నిఘాలో ఉంటారని తెలిపారు. ఏఐ ద్వారా జైళ్లలో సెల్‌ఫోన్లు, ఆయుధాలు, మాదకద్రవ్యాలు వంటి నిషేధిత వస్తువులను గుర్తించవచ్చని తెలిపారు. ఏఐ ఆధారిత వీడియో విశ్లేషణలు ఖైదీల ప్రవర్తన, మానసిక ఒత్తిడి, ఆత్మహత్య ధోరణులను అంచనా వేయగలవన్నారు. దీనివల్ల దిద్దుబాటు చర్యలకు అవకాశం కలుగుతుందని అధికారి చెప్పారు.

అంబానీ తల్లికి అస్వస్థత

ముంబై: రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత, దేశంలోనే అత్యంత సంపన్నుడైన ముఖేష్ అంబానీ తల్లి కోకిలాబెన్ అనారోగ్యానికి గురయ్యారు. ఆమె ఆరోగ్యం క్షీణించినట్లు వార్తలు వచ్చాయి. కోకిలాబెన్ శుక్రవారం ఉదయం హెచ్ఎన్ రిలయన్స్ ఆసుపత్రిలో చేరినట్లు చెబుతున్నారు. ముఖేష్, అనిల్ అంబానీ తల్లి కోకిలాబెన్‌ను(91) హెచ్ఎన్ రిలయన్స్ ఆసుపత్రిలో చేర్పించినట్లు తెలుస్తోంది.

మీడియా వార్తల ప్రకారం, కోకిలాబెన్ ఆరోగ్యం అకస్మాత్తుగా క్షీణించిందని, ఆ తర్వాత ఆమెను అత్యవసర పరిస్థితిలో హెలికాప్టర్ ద్వారా ఆసుపత్రికి తరలించినట్లు తెలుస్తోంది. కాగా అంబానీ కుటుంబం లేదా ఆసుపత్రి వర్గాలు ఇంకా ఎటువంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. కొంతకాలంగా కోకిలా బెన్ వృద్ధాప్య సమస్యతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది.

ఐదేళ్ల తర్వాత తెరుచుకున్న భారత్-చైనా ట్రేడ్ పాస్‌లు

న్యూఢిల్లీ: భారత్-చైనా మధ్య మూడు సరిహద్దు వాణిజ్య కేంద్రాల మార్గాలు ఐదేళ్ల తర్వాత తెరుచుకొన్నాయి. ఆక్కడి ప్రజలకు, టిబెట్‌లో ఆర్థిక వ్యవస్థలకు ఈ మార్గాలు కీలకం. ఈ పాస్‌లు తెరుచుకొన్న విషయాన్ని రెండు దేశాలు అధికారికంగా ప్రకటించాయి. చైనా, భారత్ విదేశాంగ మంత్రులు వాంగ్‌యీ, జైశంకర్ న్యూఢిల్లీలో భేటీ సందర్భంగా ఈ నిర్ణయం తీసుకొన్నారు. తెరుచుకొన్న మార్గాల్లో హిమాచల్‌ప్రదేశ్‌లోని ది షిప్కిలా పాస్, ఉత్తరాఖండ్‌లోని లిపులేక్ పాస్, సిక్కింలోని నాథులా పాస్ ఉన్నాయి. 2020లో కొవిడ్ కారణంగా వీటిని మూసివేశారు. వర్తకులు డిమాండ్ చేస్తున్నా సరిహద్దు ఘర్షణలు, దీర్ఘకాలిక సైనిక ఉద్రిక్తతల వంటివాటి వల్ల వాటిని తెరవలేదు. ఈ మార్గాలు చైనా వైపు షిగాట్సె, లాసా, న్యింగ్చిలను చేరతాయి. వాస్తవానికి ఈ మార్గాల్లో వాణిజ్యం మే-నవంబర్ మధ్యలోనే జరుగుతుంది. ద్వైపాక్షిక వాణిజ్యానికి భిన్నంగా జరిగే ఈ వ్యాపారంలో భారత్ ఎక్కువ ఎగుమతులతో లబ్ధి పొందింది. ఈ మూడింటిలో నాథులా పాస్ అత్యంత రద్దీగా ఉండే మార్గం. రాకపోకలు, వాణిజ్యం అత్యధికంగా ఈ మార్గంలోనే జరుగుతుంది. సిక్కిం-టిబెట్ మధ్య వాణిజ్యానికి ఇదే కారణం. 2016లో అత్యధికంగా రూ.82.6 కోట్ల వాణిజ్యం జరిగింది. షిప్కిలా పాస్ నుంచి వాణిజ్యం పరిమితంగానే జరుగుతోంది. ఇది భారత్‌లోని నేషనల్ హైవే-5కు అనుసంధానమై ఉంది. దీనికి రెండువైపులా కస్టమ్స్ ఔట్‌పోస్టులు ఉన్నాయి. ఇప్పటివరకు ఆ ప్రాంతాల్లో చెప్పుకోదగ్గ స్థాయిలో వాణిజ్యం జరగలేదు. ఉత్తరాఖండ్‌లోని పిథోర్‌ఘడ్‌కు అనుసంధానమైన లిపులేఖ్ పాస్‌లో రహదారి సౌకర్యం అంత అనువుగా ఉండదు.

విశాలాంధ్ర హైదరాబాద్

జిల్లా సమగ్రాభివృద్ధికి నిధులు కేటాయించాలి : బాలకిషన్

విశాలాంధ్ర - హైదరాబాద్ : పాలమూరు జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని మహబూబ్‌నగర్ జిల్లా సిపిఐ కార్యదర్శి బాలకిషన్ ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని, వాల్లమూరు విశ్వవిద్యాలయానికి అధిక నిధులు కేటాయించాలన్నారు. సిపిఐ రాష్ట్ర 4 మహాసభల్లో మహబూబ్నగర్ జిల్లా కార్యదర్శి బి.బాల్ కిషన్ మాట్లాడుతూ జిల్లా సమస్యల పరిష్కారానికై సుదీర్ఘ పోరాటం నిర్వహిస్తామని ప్రతినిధుల సభలోసభలో మాట్లాడారు. అదేవిధంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పేద విద్యార్థులు చదివేందుకు అగ్రికల్చర్ కళాశాల లేక విద్యార్థులు వేరే రాష్ట్రాలకు వెళుతున్నందున మన పాలమూరు యూనివర్సిటీలో అగ్రికల్చర్ కోర్సులు మంజూరు చేయాలని కోరడం జరిగింది. పాలమూరు పట్టణంలో కబ్జాలకు గురైన ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు. అదేవిధంగా 523 సర్వే నెంబర్లు పట్టాలు కోల్పోయిన నిరుపేదలకు మిగిలిపోయిన డబ్బులు బెడ్ రూములు ఇవ్వాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని అనేక అంశాలపై మాట్లాడడం జరిగింది. రాష్ట్ర నాలుగోవ మహాసభలకు ప్రతినిధులుగా మహబూబ్ నగర్ జిల్లా నుండి మాజీ కార్యదర్శి పరమేష్ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపల్లి రాము, పి సురేష్, గోవర్ధన్ పాల్గొన్నారు.

ఆర్సీసీ పైపులైన్ నిర్మాణ పనులు ప్రారంభం

విశాలాంధ్ర - మల్కాజిగిరి : గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీతా రాము యాదవ్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని రామాంజనేయ నగర్‌లో 16 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న ఆర్సీసీ పైపులైన్ నిర్మాణ పనులను ఆమె శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ దశాబ్ద కాలంగా అన్నపూర్ణ సొసైటీ శివగంగా రామాంజనేయ నగర్ తదితర ప్రాంతాలలో మహేంద్ర హిల్స్ నుంచి వచ్చే మురుగునీటితోపాటు వర్షాకాలంలో వర్షపు నీరు పొంగిపొర్లి కాలనీలలో ప్రవహించడంతో ఆ సమస్య పరిష్కారానికి ఆర్సీసీ పైపుల నిర్మాణ పనులను చేపట్టామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పాటు పడుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఏఈ దివ్య జ్యోతి, నాయకులు మేకల రాము యాదవ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి బైరు అనిల్ బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సమస్యల వలయంలో మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయం

విశాలాంధ్ర - మల్కాజిగిరి : సమస్యల వలయంలో మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయం కొట్టామిట్టాడుతోంది. సర్కిల్లోని లిఫ్ట్ పని చేయక చాలా కాలం అవుతున్నప్పటికి పట్టించుకునే నాధుడే కరువయ్యారనే విమర్శలు చోటు చేసుకుంటున్నాయి. వికలాంగులు, వృద్దులు ప్రజావాణిలో వినతిపత్రాలు ఇవ్వాలంటే రెండవ అంతస్తుకు వెళ్లాలంటే వెళ్ళలేని దుస్థతి నెలకొంటుందని పలువురు పేర్కొంటున్నారు. కార్యాలయంలో పలు విభాగాల్లో స్టేషనరీ లేక సిబ్బంది సైతం ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిసింది. కంప్యూటర్‌కు సంబంధించినటువంటి ప్రింటర్స్, అధికారులు ఏవైన లెటర్లు ప్రింటింగ్ తీసుకోవడానికి పేపర్లు లేకపోవడంతో సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలియ వచ్చింది. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఉప కమిషనర్ వీటిపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు సిబ్బంది పేర్కొంటున్నారు. సర్కల్‌లో పని చేసే సిబ్బంది కొంత మంది తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ పనులు చేయకపోయినా పట్టించుకునే వారే లేరని పలువురు వాపోతున్నారు. రెవెన్యూ సిబ్బంది విభాగంలో పని చేసే ఓ ఏఎంసి ఏ నాడు తన విధులు నిర్వర్తించకపోయినా ఆయనపై ఏ ఉన్నతాధికారి దృష్టసారించని పరిస్తితి నెలకొంటుందనే ఆరోపణలు చోటు చేసుకుంటున్నాయి. ఆయన విధులు నిర్వర్తించకపోగా ఆయన పరిధిలో పని చేసే సిబ్బందిని మాత్రం ఇబ్బందులకు గురి చేస్తంటారనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. తాను కార్యాలయానికి వచ్చి ఏదో మూలన పడుకోవడం లాంటి పని మాత్రం చేస్తుంటారనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఇలాంటి వారిపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు పేర్కొంటున్నారు. జిహెచ్ఎంసి పన్నుల వసూలుకు వెళ్లాల్సి ఉన్నా తాను కార్యాలయానికే పరిమితం అవుతారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సైబర్ మోసాలపై ఎస్‌బిఐ విస్తృత ప్రచారం

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలందరికీ సైబర్ మోసాలపై అవగాహన కల్పించడంలో భాగంగా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హైదరాబాద్ సర్కిల్ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, కార్యాలయాలు, మాల్స్, మెట్రో స్టేషన్లు, పార్కులు వంటి వివిధ ప్రదేశాలలో వివిధ డిజిటల్ మోసాలపై అవగాహన కార్యకలాపాలను నిర్వహిస్తోంది. శుక్రవారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో కలిసి, వివిధ కళాశాలలు విశ్వవిద్యాలయాల విద్యార్థులుగా లక్ష్య సమూహంతో సైబర్ మోసం అవగాహనపై టౌన్ హాల్ సమావేశాన్ని నిర్వహించింది. వీరనారి చాకలి ఇలమ్మ ఉమెన్స్ యూనివర్సిటీ, సన్ ఇంటర్నేషనల్ కాలేజీ, పిడిఎస్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, గులాం అహ్మద్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ మొదలైన వాటి నుండి సుమారు 450 మంది విద్యార్థులు పాల్గొన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ రవికుమార్, ఆర్.బి.ఐ చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్ సుబ్బయ్య సీనియర్ అధికారులు పాల్గొన్నారు. వివిధ రకాల సైబర్ మోసాలపై స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వివరణాత్మక ప్రజెంటేషన్‌ను అందించింది. విద్యార్థులు జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలని వారి సర్కిల్‌లో అవగాహనను వ్యాప్తి చేయాలనీ సూచించారు. 1930, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ ప్రాముఖ్యతను www.cybercrime.gov.in తో పాటు వివరించబడింది.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి: కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టడంతో పాటు సోమవారం నుండి ఇంటింటికి జ్వరాల సర్వేను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో, జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి పారిశుద్ధ్యం వనమహోత్సవం, త్రాగునీటి వసతి ఇందిరమ్మ ఇళ్లపై ఎంపీడీవోలు మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు ఇంటింటికి తిరిగి జ్వరాల సర్వే చేపట్టాలని అన్నారు. వైద్య అధికారులు, సిబ్బంది సమన్వయం చేసుకుంటూ ప్రజల ఆరోగ్యాలతో ముడిపడి ఉన్న శానిటేషన్ నిర్వహణలో నిర్లక్ష్యానికి తావు లేకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వహించాలని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి, గ్రామాలలో, మున్సిపల్ పరిధిలో పారిశుద్ధ్యం పనులు, సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండడానికి చర్యలు చేపట్టాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఉండడానికి ఆయిల్ బాల్స్‌ను వాటర్ నిలిచి ఉన్నచోట వేయాలన్నారు.ట్యాంకులలో నిల్వ ఉన్న నీటి మొత్తాన్ని పారవేయాలి అన్నారు. ఓ.హెచ్.యస్.ఆర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు బ్లీచింగ్, క్లోరినేషన్ తో శుభ్రం చేసి కొత్త నీటిని నింపాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు ప్రతిరోజు ఫాగింగ్ చేయించాలని అన్నారు. వైద్య సిబ్బంది మెడికల్ క్యాంపులు నిర్వహించి గ్రామాల్లో డెంగ్యూ ,మలేరియా, ఇతర సీజనల్ వ్యాధులు, విష జ్వరాలు ప్రబలకుండా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, పంచాయతీరాజ్ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ముందు జాగ్రత్తగా ప్రతి శుక్రవారం జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామాలలో మున్సిపల్ పరిధిలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు ఏఎన్ఎంలో సమన్వయంతో పంచాయతీ, మల్టీపర్పస్ సిబ్బందితో గ్రామంలో అవసరమైన పారిశుద్ధ్య పనులకు చర్యలు చేపట్టాలన్నారు. దోమల ద్వారా డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా లాంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా అన్ని హ్యాబిటేషన్లలో ఫాగింగ్ చేపట్టాలన్నారు. వర్షానికి పడిపోయిన విద్యుత్ స్తంభాలు, పోల్స్ గుర్తించి మరమ్మత్తులు చేయించాలని ట్రాన్స్కో అధికారులకు తెలిపారు. గ్రామాలలో పాఠశాలలో,అంగన్ వాడి కేంద్రాలలో పారిశుద్ధ్యం పనులు చేపట్టాలన్నారు. గ్రామాలలో నివసించే ప్రజలకు ప్రాణనష్టం జరగకుండా చూడాలన్నారు. వర్షానికి డ్రైనేజీలలో చెత్తాచెదారం పేరుకుపోకుండా శుభ్రం చేయించాలన్నారు. వర్షం నీరు నిలువ ఉంచకుండా ముందుకు ప్రవహించేలా డ్రైన్లనుశుభ్రం చేయాలన్నారు. త్రాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా మిషన్ భగీరథ అధికారులు గ్రామాల్లో పర్యటించి పైప్ లైన్ లీకేజీలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. వన మహోత్సవం పై సమీక్షిస్తూ జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను వంద శాతం సాధించేందుకు శాఖల వారీగా లక్ష్యాలను ఈ నెల 31వ తేది లోపు ప్లాంటేషన్ పూర్తి చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పై సమీక్షిస్తూ గ్రౌండింగ్ చేసి బేస్మెంట్ లెవెల్ వరకు వచ్చిన ఇండ్లకు పేమెంట్ చేయాలని, త్వరగా ఇండ్ల నిర్మాణం పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాల ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ సమావేశం

విశాలాంధ్ర, హైదరాబాద్ : గణేష్ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ ఘనంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనం సమావేశ మందిరంలో గణేష్ చతుర్థి ఉత్సవాల ఏర్పాట్లపై డిసిపిలు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనరులు, పోలీస్ అధికారులు, గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు, సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 27న వినాయకచవితి ఉత్సవాలు ప్రారంభమై సెప్టెంబర్ 6న నిమజ్జనం చేయనున్నందున, వినాయక మండపాలు ఏర్పాటు చేసే భక్తులు, నిర్వాహకులు భక్తి శ్రద్దలతో సురక్షిత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి మండపాల నిర్వాహకులు తగు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. జిల్లాలో గణేష్ నిమజ్జనం నిర్వహించేందుకు 44 చెరువులను గుర్తించినట్లు తెలిపారు. గణేష్ శోభాయాత్ర నిర్వహించే దారిలో గుంతలు పడిన రహదారులు, ప్యాచ్ వర్క్ రిపేర్ పనులు, గణేష్ నిమజ్జనం నిర్వహించే ప్రదేశాల వద్ద క్రెన్లు, బారికేడింగ్, వేదిక ఏర్పాట్లు మున్సిపల్, ఆర్ అండ్ బి శాఖ అధికారులు కలసి చేపట్టాలని, అధికారులు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా ప్రణాళిక రూపొందించుకొని సమన్వయముతో పని చేయాలని సూచించారు. విగ్రహాలు ఊరేగింపు సమయంలో వాహనాల్లో ఎటువంటి యాంత్రిక సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని, నిమజ్జనం సమయంలో వేలాడే తీగలు, వంగి ఉన్న చెట్లు, తదితర వాటిని తొలిగించాలని తెలిపారు. చెరువుల వద్ద క్రేన్ లను ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి శశిధర్ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేసేలా, నిమజ్జనం సమయంలో చెరువుల వద్ద అవసరమైన క్రేన్లు ఏర్పాటు చేయాలని, విద్యుత్ అంతరాయం లేకుండ విద్యుత్ సరఫరా చేయాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండ ఏర్పాట్లు చేపట్టేలా అధికారులకు సూచనలు చేయాలని కలెక్టర్ గారిని కోరడం జరిగినది. జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, మహేశ్వరం డిసిపి సునితా రెడ్డి, ఎల్బీనగర్ డిసిపి ప్రవీణ్ కుమార్, శంషాబాద్ అడిషనల్ డిసిపి కె. రామ్, కుమార్, మాదాపూర్ అడిషనల్ డిసిపి సాయిరామ్, ఆర్డీఓలు అనంత రెడ్డి, చంద్రకళ, సరిత, జగదీశ్వర్ రెడ్డి, మున్సిపల్ కమిషనరులు, పోలీస్ అధికారులు, ఆర్ అండ్ బి అధికారులు, గణేష్ ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో ఉచిత గణపతి విగ్రహాల పంపిణీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్ మహా నగర అభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) కాలుష్య నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించింది. పెరుగుతున్న జనాభా, రవాణా, వ్యర్థాల నిర్వహణ సమస్యలతో తలెత్తుతున్న వాయు, జల, భూ కాలుష్యాన్ని తగ్గించడానికి హెచ్‌ఎండీఏ ప్రాధాన్యత ఇస్తోంది. ఈ క్రమంలో పర్యావరణ హిత గణపతి విగ్రహాలను ప్రోత్సహిస్తోంది. మట్టి గణపతుల విగ్రహాలను వినియోగించాలంటూ ప్రచారం చేస్తోంది. మట్టి విగ్రహాలను నీటి వనరులలో నిమజ్జనం చేయడం వల్ల జల వనరులకు ఎటువంటి హాని ఉండదని చెబుతోంది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాల వాడకాన్ని తగ్గించడానికి 2017 నుండీ హెచ్‌ఎండీఏ ప్రజలకు ఉచితంగా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తోంది. ఈ ఏడాది కూడా ఈ ఆనవాయితీని కొనసాగిస్తోంది. ఈ క్రమంలో ఈ ఏడాది లక్ష మట్టి గణపతి విగ్రహాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రజలు, స్వచ్ఛంద సంస్థలకు వీటిని ఉచితంగా పంపిణీ చేయనుంది. హైదరాబాద్‌లో 34 ప్రాంతాలలో ఈ పంపిణీ జరుగుతుంది. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పిస్తుంది. ఈ నెల 24, 25, 26 తేదీల్లో ఈ విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టనుంది. సైలెంట్ వ్యాలీ- బంజారా హిల్స్, రోడ్ నంబర్ 10 ఐఎఎస్ క్వార్టర్స్- బంజారాహిల్స్, కేబీర్ పార్క్ ఎంట్రన్స్- జూబ్లీహిల్స్, గ్రీన్ ల్యాండ్స్, ప్రెస్ క్లబ్- సోమాజీగూడ, ఎల్లమ్మ దేవాలయం- బల్కంపేట్, పెద్దమ్మ ఆలయం- జూబ్లీహిల్స్, రైతు బజార్- మెహదీపట్నం, శిల్పారామం- హైటెక్ సిటీ, శిల్పారామం- ఉప్పల్, సఫిల్ గూడ పార్క్‌తార్నాక కమర్షిల్ కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో పంపిణీ చేయనున్నారు.

చట్ట సభల్లో సిపిఐకి ప్రాతినిధ్యంతో బలహీనవర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలో ఎంఎల్‌సి, సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం

విశాలాంధ్ర - హైదరాబాద్ : పొట్లూరి నాగేశ్వరరావునగర్ ప్రస్తుత శాసనసభ, శాసన మండలి ఉభయ సభలలో సిపిఐకి ప్రాతినిధ్యం ఉండడంతో బడుగు, బలహీన, కార్మిక వర్గాల సమస్యల పరిష్కారానికి మరింత కృషి చేస్తామని ఎంఎల్‌సి, సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం చెప్పారు. గడిచిన ఏడాది కాలంగా చట్టసభలలో పేద ప్రజల సమస్యలను లేవనెత్తడంతో పాటు, బయట అనేక ప్రజా ఉద్యమాలను నిర్వహించడం ద్వారా ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్విరామంగా కృషి చేస్తోందన్నారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా పొట్లూరి నాగేశ్వరరావునగర్' (గాజుల రామారం)లోని ఎస్.బాలమల్లేశ్ హాల్‌లో జరుగుతున్న సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రవేశపెట్టిన రాజకీయ, నిర్మాణ నివేదిక (ముసాయిదా)పై జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెల్లికంటి సత్యం మాట్లాడుతూ బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సిపిఐ అనేక ప్రజా ఉద్యమాలను నిర్వహించిందని చెప్పారు. దిండి ప్రాజెక్టును తక్షణమే పూర్తి చేసి నల్లగొండ జిల్లాకు సాగు నీరు అందించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ 25 రోజుల పాదయాత్ర చేపట్టడం ద్వారా ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడిని తీసుకువచ్చిన విషయాన్ని సత్యం గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర రాజకీయాలను మలుపు తిప్పిన మునుగోడు ఉప ఎన్నికతో కమ్యూనిస్టుల ప్రాధాన్యత మరోసారి స్పష్టమైందని నెల్లికంటి సత్యం అన్నారు. కమ్యూనిస్టుల ప్రాబల్యం తగ్గిందన్న వారికి ఇదో చెంప పెట్టు అయిందని పేర్కొన్నారు.

ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులపై చేపట్టిన దమనకాండను నిరసిస్తూ మొట్ట మొదటగా సిపిఐ ఖండించడంతో పాటు వామపక్ష పార్టీలతో కలిసి నిరసన చేపట్టినట్లు వివరించారు.

జర్నలిస్టుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : ఎన్నో ఏళ్లుగా పెండింగ్లో ఉన్న జర్నలిస్టుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని లేదంటే ఆందోళన తప్పదని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీ యు డబ్ల్యు జే) రాష్ట్ర కోశాధికారి మోతె వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం కీసరలో జరిగిన టీయూడబ్ల్యూజే మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు అధ్యక్షతన జరిగిన జిల్లా విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టి రెండు సంవత్సరాలు కావస్తున్న ఇప్పటికీ జర్నలిస్టుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించకపోవడం విచారకరమన్నారు. తక్షణమే జర్నలిస్టుల ఆరోగ్య భద్రత కోసం హెల్త్ కార్డులను పునరుద్ధరించాలని, అన్ని ఆసుపత్రులలో చెల్లుబాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రిడి టేషన్‌ల నియమ నిబంధనలను తక్షణమే విడుదల చేసి కొత్త కార్డులను జారీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు మాట్లాడుతూ జిల్లాలో మన సంఘం బలోపేతంగా ఉందని రాష్ట్ర కమిటీ కూడా అభినందించిందన్నారు.వర్కింగ్ జర్నలిస్టులందరినీ కూడా సభ్యులుగా చేర్చుకొని సంఘం పటిష్టతకు పాటుపడాలన్నారు. సెప్టెంబర్ 5 వరకు సభ్యత్వ నమోదులను పూర్తిచేసి నూతన కమిటీల ఏర్పాటు ప్రక్రియను మొదలుపెట్టాలని సూచించారు. జర్నలిస్టులు అంతా ఐక్యమత్యంగా ఉండి పోరాటం చేస్తేనే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందన్నారు. జిల్లా కార్యదర్శి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ జిల్లా కార్యవర్గంలో తీసుకున్న నిర్ణయాలను కమిటీ సభ్యులందరూ గౌరవించి అందుకు అనుగుణంగా పని చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర నాయకత్వం సూచించే సూచనల మేరకు జిల్లా కమిటీ బాధ్యత వహించాల్సిన అవసరం ఉందన్నారు.

రాజా బహదూర్ వెంకటరామారెడ్డి ఆశయాలు కొనసాగిస్తాం

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాజా బహదూర్ వెంకటరామ రెడ్డి ఆశయాలు కొనసాగిస్తామని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. పాలమూరు రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో రాజా బహదూర్ వెంకటరామ రెడ్డి 156 వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబ్ నగర్ నగరం, పద్మావతి కాలనీలో గ్రీన్ బెల్ట్‌లో ఉన్న రాజా బహదూర్ వెంకటరామ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద విద్యార్థులు చదువుకోవడానికి ఎలాంటి వసతులు లేని సమయంలోనే హైదరాబాద్‌లో కులమతాలకు అతీతంగా హాస్టల్ నిర్మించి పేద విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చారని, మహిళలు చదువుకుంటే సమాజం బాగుపడుతుందని భావించి, 100 సంవత్సరాల క్రితమే రెడ్డి మహిళా కళాశాలను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. వారి ప్రేరణతో మహబూబ్‌నగర్‌లో నిర్మించిన రెడ్డి హాస్టల్ ఇప్పుడు ఐఐఐటి కళాశాలకు తాత్కాలిక భవనంగా ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని విద్యా నిధికి చేయూతనిచ్చి పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టి పిసిసి ప్రధాన కార్యదర్శి మిథున్ రెడ్డి, పాలమూరు రెడ్డి సేవ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు తూము ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి వేపూరి రాజేందర్ రెడ్డి, కోశాధికారి మల్లు నర్సింహ్మారెడ్డి, సహాధ్యక్షులు ధనుంజయరెడ్డి, ఉపాధ్యక్షులు వెంకట్రామిరెడ్డి, ఉదయశ్రీ, ప్రచార కార్యదర్శి సురేందర్ రెడ్డి, కార్యదర్శి కోటేశ్వర్ రెడ్డి, పరమేశ్వర రెడ్డి, సలహాదారు మనోహర్ రెడ్డి, మద్ది అనంత రెడ్డి, జి.రాజేందర్ రెడ్డి, యాదిరెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు మల్లు సరస్వతి, స్వరూప, శోభ, వరలక్ష్మీ, వనజ కవిత, మాజీ కౌన్సిలర్లు విఠల్ రెడ్డి, అనంత రెడ్డి, రవికిషన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రామకృష్ణ రెడ్డి, శివారెడ్డి, దామోదర్ రెడ్డి, బాల్ రెడ్డి పాల్గొన్నారు.

మూన్ సెషన్‌లు విద్యార్థుల నైపుణ్యాలను అభివృద్ధి చేస్తాయి

విశాలాంధ్ర - హైదరాబాద్ : మోడల్ యునైటెడ్ నేషన్స్ (మూన్) సెషన్‌లు విద్యార్థుల విమర్శనాత్మక ఆలోచన, నాయకత్వం వంటి కీలక నైపుణ్యాలను అభివృద్ధి చేస్తాయని కుతుబుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద గౌడ్ పేర్కొన్నారు. మూన్ సెషన్‌లు ఐక్యరాజ్యసమితిని అనుకరించే విద్యా సమావేశాలలో ప్రతి విద్యార్థి పాల్గొని తమ ప్రతిభ కనబరచాలని కోరారు. హైదరాబాద్, గుండ్ల పోచంపల్లి డిఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ క్యాంపస్‌లో శుక్రవారం డిఆర్ఎస్ 2025 మూన్ సెషన్‌లను స్కూల్ డైరెక్టర్లు డాక్టర్ అంజనీ కుమార్ అగర్వాల్, గర్వ్ అగర్వాల్, ప్రిన్సిపాల్, ఐ. వేణుగోపాల్ లతోకలసి కె.పి. వివేకానంద గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మూన్ సెషన్‌లు విద్యార్థులకు భవిష్యత్తులో ప్రపంచ దేశాలను పరిశోధించడానికి, ప్రపంచ సమస్యలను చర్చించడానికి అంతర్జాతీయ సమస్యలకు పరిష్కారాలను చర్చించడానికి వీలు కల్పిస్తాయన్నారు. విద్యార్థులు ప్రజా ప్రసంగం, పరిశోధన, రచన మరియు దౌత్యంతో కూడిన నిర్మాణాత్మక ఎజెండాను అనుసరించాలని అన్నారు. మూడు రోజుల మూన్ సెషన్‌లలో ప్రెస్ కార్ప్స్, ఇండియన్ ప్రీమియర్ లీగ్, ఎఫ్ఐఎ, యు.ఎన్.హెచ్.ఆర్.సి, డిఐఎస్ఈసి, యుఎన్ఈపి, డబ్ల్యూఈఎఫ్, ఏ.ఐ.పి.పి.ఎం, నిరంతర సంక్షోభ కమిటీ లతోపాటు ప్రత్యేకంగా నేతాజీ ఫైల్స్ సెషన్‌లను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సెషన్‌లలో విద్యార్థులు ఉత్సాహభరితమైన సంభాషణలు, అనర్గళమైన వాక్చాతుర్యం ప్రపంచ పౌరసత్వం నీతి అచంచలమైన నిబద్దత ప్రదర్శించి తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మూన్ అధ్యక్షురాలు ఎస్. మేరీ తనూజ, 2025 మూన్ సెషన్‌ల సెక్రటరీ జనరల్ అద్విక్ రెడ్డి వివిధ స్కూల్ ల నుండి విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలపై పోరాడిన

గంగాధర్ రెడ్డిని అరెస్టు చేయడం దారుణం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : ఎన్నికలకు ముందు ప్రజలకు 6 గ్యారంటీల హామీలతో అధికారంలోకి వచ్చి తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా, హైదరాబాద్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలపై ఈరోజు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు నిర్వహించిన సేవ్ హైదరాబాద్ ఛలో సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్న గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డిని సెక్రటేరియట్ దగ్గర పోలీసులు అన్యాయంగా అరెస్ట్ చేశారు.ప్రజల తరపున నిజమైన సమస్యలపై పోరాడిన నేతలను అణచివేయడం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక ధోరణి అని స్పష్టంగా బయటపెడుతోందని గంగాధర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు కావస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీలు ఒక్కటి కూడా అమలు చేయలేకపోయిందనీ ఆరోపించారు. రైతులకు సాగునీరు ఇవ్వలేని ఈ సర్కారు, యూరియా కూడా సరఫరా చేయలేదని, ఇప్పుడు హైదరాబాద్ ఉచిత తాగునీటి పథకానికి కూడా పాతరేయాలని చూడటం వారి మూర్ఖత్వానికి పరాకాష్ట అని అన్నారు. హైదరాబాద్ ప్రజలపై, తెలంగాణ ప్రజలపై మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి త్వరలోనే గట్టి గుణపాఠం చెబుతారని గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ధ్వజమెత్తారు.